Follow: @ANNTELUGU

01-02-2026

మహా పత్రిక

ANN తెలుగు

ఆదివారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 36   పేజీలు-08   వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## నిర్మలమ్మ పద్దు

- తొమ్మిదవ సారి బడ్జెట్ తో రికార్డు
- మొట్టమొదటి సారి మంగళగిరి చేనేత వైభవంతో..

02



## మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్

- కీలక శాఖల కేటాయింపు

02



## ఒక్క రోజులో కిలో వెండికి లక్ష లాస్

- డాలర్ బలపడటంతో బంగారం, వెండి ధరలు పతనం

02



కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## విచారణ.. ప్రజా స్పందన

తెలంగాణ రాజకీయాల్లో ఓ కీలక పరిణామం. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఆదివారం సిట్ అధికారులు విచారించనున్నారు. గతంలో కాళేశ్వరం విచారణకు కేసీఆర్ హాజరై వాంగ్మూలమిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసు అందుకు భిన్నమైంది. రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి కేసీఆర్ అండ్ ఫ్యామిలీ ట్యాపింగ్ మార్గం ఎంచుకుని అనేక రకాలుగా ప్రత్యర్థులను కట్టడి చేశారన్నా ఆరోపణలు గత ఐదారేళ్ళుగా విపక్షాలు చేస్తుండగా, ఇపుడు విచారణ జరగనుంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిందని అప్పటి ప్రతిపక్ష నేతలంతా చెప్పడంతో పాటు వందల స్టేట్ మెంట్లు రికార్డుచేయగా, ఇపుడు కేసీఆర్ ను ఏం ప్రశ్నిస్తారు? విచారణతో ముగుస్తుందా? అరెస్ట్ ల వకు దారితీస్తాయా? అన్నది చూడాల్సి ఉంది. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని, రేవంత్ స్థిరమైన వ్యూహాత్మక నాయకత్వం కాంగ్రెస్ పట్టును కొనసాగిస్తున్నదని ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది సర్వే తేల్చిచెప్పింది. ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి హవా మరింత పెరిగిందని ఈ సర్వే స్పష్టం చేసింది.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో






### తెలంగాణ ఆత్మగౌరవ నినాదం.. రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

కేసీఆర్ విచారణను కేవలం ఒక దర్యాప్తుగా కాకుండా, తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవంపై జరిగిన దాడిగానే బీఆర్ఎస్ అభివర్ణిస్తోంది. తెలంగాణ సాధించిన ఉద్యమ నేతను కావాలనే అవమానిస్తున్నారని మండిపడుతున్న పార్టీ శ్రేణులు, ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. మున్సిపల్ ఎన్నికల ముంగిట కావాలనే కుట్రపూరితంగా ఈ విచారణలు సాగిస్తున్నారని, రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ రాజకీయ కక్షసాధింపు అని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

# వస్తున్నా...

# సిట్ విచారణకు కేసీఆర్ సై

### సిట్ ఏసీపీకి ఆరు పేజీల లేఖ రాసిన కేసీఆర్

- చట్టపరమైన అభ్యంతరాలున్నా విచారణకు సహకరిస్తానని హామీ
- నంది నగర్ నివాసం వద్ద పోలీసుల భారీ బందోబస్తు
- కేటీఆర్. హరీష్, సంతోష్ ల విచారణలోని అంశాలతో కేసీఆర్ ను ప్రశ్నించే అవకాశం
- భారీ నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచరకణకు కేసీఆర్ సిద్ధమయ్యారు. నందినగర్ లోని తన నివాసంలో సిట్ విచారణకు కేసీఆర్ ఓకే చెప్పారు. దీంతో రెండు రోజుల ఉత్కంఠతకు తెరపడింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ పార్టీ కీలక నేతలు, న్యాయ నిపుణులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, చట్టాన్ని గౌరవిస్తూనే ప్రజాక్షేత్రంలో గట్టి సమాధానం చెప్పాలని గులాబీ దళం భావిస్తోంది. ఆదివారం సాయంత్రం 3 గంటలకు నందినగర్ నివాసంలో విచారణ జరగనుండటంతో, కేసీఆర్ ఆదివారం ఉదయమే ఎర్రవల్లి నుంచి హైదరాబాద్ చేరుకోనున్నారు.

మిగతా 2లో



## కౌశిక్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఫైర్

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు ద్వేషాన్ని బయటపెట్టాయి

**హైదరాబాద్, మహా :** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై మతం పేరుతో వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఐపీఎస్ అధికారిని ఉద్దేశించి కౌశిక్ రెడ్డి చేసిన

మిగతా 2లో



## మహా జాతర సక్సెస్

- భక్తుల సహకారంతో ఘనంగా జాతర
- ఫలించిన ముందస్తు ప్రణాళికలు, నూతన అభివృద్ధి పనులు
- మేడారం జాతరపై మంత్రి సీతక్క


02



## కరీంనగర్ మేయర్, 3 చైర్మన్ పీఠాలు బీజేపీవే...

- తప్పుడు ప్రచారాలు నమ్మకండి
- డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలించండి
- కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

02



## జనం నుంచి వనంకు వన దేవతలు

ముగిసిన మేడారం మహా జాతర ప్రస్థానం

వన ప్రవేశం చేసిన సమ్మక్క, సారలమ్మ

02

## ప్రతి డివిజన్ గెలుపు మనకు ముఖ్యమే

### గెలిచే వారికే టికెట్లు ఇవ్వండి.. జీరో రెబెల్ స్ట్రాటజీ అమలుచేయండి

మంత్రులకు, నేతలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం.. అమెరికా నుండి జూమ్ సమావేశం

నియోజకవర్గ ఇన్ ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి




**హైదరాబాద్, మహా :** మునిసిపల్ ఎన్నికల్లో గెలిచే వారికే టికెట్లు ఇవ్వాలని, మొహమాటాలు లేకుండా ప్రతీ డివిజన్ ను, వార్డును సీరియస్ గా తీసుకుని గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో

### జీహెచ్ఎంసీ బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం

## రూ.11,640 కోట్లతో బడ్జెట్




**హైదరాబాద్, మహా:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) వార్షిక బడ్జెట్‌ను చివరి స్పెషల్ జనరల్ బాడీ సమావేశం ఆమోదించింది. శనివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ 10వ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో కమిషనర్ కర్ణన్, అడిషనల్ కమిషనర్(ఫైనాన్స్) అనురాగ్ జయంతి ప్రవేశ పెట్టిన ప్రతిపాదనలపై సభ్యులు చర్చించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్ పార్టీల నుంచి సభ్యులు చర్చలో పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ మొత్తం బడ్జెట్ రూ. 11,460 కోట్లుగా పేర్కొంది. ఆదాయం రూ. 6,441 కోట్లు, జీహెచ్ఎంసీ ఖర్చు రూ. 4,057 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,384 కోట్లు, రెవెన్యూ గ్రాంట్స్ రూ. 400 కోట్లు, కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం రూ.2,260 కోట్లను కేటాయించింది. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ రూ. 1,860 కోట్లుగా పేర్కొంది. జీహెచ్ఎంసీ బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

## 4న రాష్ట్రానికి రానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

### మహబూబ్ నగర్ జిల్లా బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరు

భారీ బహిరంగసభకు బీజేపీ ఏర్పాట్లు.. ఎంవీఎస్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఎంపీ డీకే అరుణ

నబిన్ తొలి పర్యటనకు భారీ ఏర్పాట్లు చేస్తున్న పార్టీ



**మహబూబ్ నగర్, మహా :** బీజేపీ జాతీయ నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన 4 వ తేదీన తెలంగాణ పర్యటనకు రానున్నారు. మహబూబ్ నగర్ లో జరిగే పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తలతో ఆయన భేటీ కానున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంవీఎస్ కళాశాల మైదానాన్ని ఎంపీ డీకే అరుణ శనివారం పరిశీలించారు. పోలింగ్ బూత్ కార్యకర్తల భేటీకి అన్ని రకాలుగా

మిగతా 2లో



## ఆపరేషన్ స్మైల్ తో 5,582 మంది చిన్నారులకు విముక్తి

అదనపు డీజీపీ చారుసిన్హా

వివరాలు 2లో

## కోఠి ఎస్‌బీఐ వద్ద కాల్పులు

### వ్యక్తిని గన్‌తో కాల్చిన దుండగులు.. రూ.6 లక్షలు అపహరణ

పోలీసులను ఏమార్చేందుకు డ్రస్ లు మార్చుకున్న అగంతకులు

అగంతకుల గాలింపు కోసం రంగంలోకి ఐదు బృందాలు




**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహా నగరంలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. నగరం నడిబొడ్డున ఉన్న కోఠి ఎస్‌బీఐ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద సినీ ఫక్కీలో కాల్పులు జరిపారు గుర్తు తెలియని దండగులు. శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు

మిగతా 2లో

## మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్

### సీఎం చంద్రబాబుపై వ్యాఖ్యలపై భగ్గుమన్న టీడీపీ శ్రేణులు

అంబటి ఇంటి వద్ద 6 గంటలకు పైగా నిరసన.. అరెస్ట్ అనంతరం అంబటి ఇంటికి నిప్పపెట్టిన అల్లరిమూకలు

**అమరావతి, మహా:**

ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరులోని నవభారత్ నగర్ లోని నివాసం నుంచి ఆయనను తీవ్ర ఉద్రిక్తత మధ్య పోలీసు వాహనంలోకి ఎక్కించి తరలించారు. వివరాల్లోకి వెళితే, గుంటూరులో తిరుమల లడ్డూల్లో నెయ్యి కల్తీ జరిగిందంటూ టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదంపై స్పందిస్తూ అంబటి రాంబాబు ముఖ్యమంత్రిని ఉద్దేశించి తీవ్రమైన, అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నేతలు, కార్యకర్తలు గుంటూరులోని అంబటి నివాసం వద్దకు భారీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. దాదాపు 6 గంటలకు పైగా నిరసన కొనసాగింది. ఈ క్రమంలో ఆయన ఇంటిపై రాళ్లు రువ్వడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

మిగతా 2లో



# వస్తున్నా...

సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తానని సిట్ ఏసీపీకి ఆరు పేజీల లేఖ రాసిన కేసీఆర్ దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై ఆక్షేపిస్తూ పలు ప్రశ్నలను లేవనెత్తారు. గోడకు నోటీసులు అంటించడం సరైంది కాదవని, ఇది తన ప్రతిష్టకు భంగం కలిగించే చర్య అని పేర్కొన్నారు. ొల నోటీసులను గౌరవించి రిప్లై ఇచ్చానని, అయినా రాత్రి పూట ఇంటి గోడకు నోటీసులు అంటించి వెళ్ళడం వెనుక మీరు పొందిన పైశాచిక ఆనందం ఏమిటని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తినని, రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటానని, ఎక్కడా పోలీసులకు, దర్యాప్తు అధికారులకు సహకరించకుండా తప్పించుకోలేదని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. మాజీ సీఎంను అన్న గౌరవం కూడా లేకుండా దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**కేటీఆర్, హరీష్ రావు వాంగ్మూలాల ఆధారంగా విచారణ**

సిట్ అధికారులు ఇప్పటికే ఈ కేసులో కీలకమైన సమాచారాన్ని సేకరించారు. గత కొన్ని రోజులుగా కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులను సుదీర్ఘంగా ప్రశ్నించిన అధికారులు, వారి నుంచి సేకరించిన వాంగ్మూలాలు, గతంలో ఐదుగురు పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్మూలాల ఆధారంగా కేసీఆర్ కోసం ప్రత్యేక ప్రశ్నావళిని సిద్ధం చేశారు. అసలు ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఇంటెలిజెన్స్ సమాచారం ఎవరెవరికి చేరింది అనే అంశాలపై అధికారుల ప్రశ్నలు ప్రధానంగా ఉండనున్నాయి. 65 ఏళ్లు పైబడిన వ్యక్తి కాబట్టి ఆయన నివాసంలోనే విచారించేందుకు అధికారులు 160 సీఆర్ పీసీ కింద నోటీసులు జారీ చేశారు.

**పోలీసుల భారీ బందోబస్తు**

ఈ హైప్రొఫైల్ విచారణ , బీఆర్ఎస్ ఆందోళనలకు పిలుపునివ్వడంతో నందినగర్ చుట్టూ భద్రతా వలయాన్ని పోలీసులు ఏర్పాటు చేయనున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో, శాంతిభద్రతల దృష్ట్యా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి నందినగర్ వెళ్లే దారులన్నీ పోలీసుల ఆధీనంలోకి వెళ్లనున్నాయి. ఆదివారం జరగబోయే ఈ విచారణ ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# మహా జాతర సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

**హైదరాబాద్, మహా:** మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ఈ ఏడాది అత్యంత ఘనంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు. కోట్లాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యాలు ఎదుర్కోకుండా తల్లులను ప్రశాంతంగా దర్శించుకోవడం ప్రభుత్వ యంత్రాంగం సాధించిన ముఖ్యమైన విజయంగా మంత్రి పేర్కొన్నారు. జాతర నిర్వహణకు ముందే రూపొందించిన సమగ్ర ప్రణాళికలు, స్పష్టమైన వ్యూహాలు, శాఖల మధ్య సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఫలించాయని తెలిపారు. రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లు, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ భద్రత వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడం వల్ల జాతర ఎక్కడా అంతరాయం లేకుండా సాగిందని చెప్పారు. ఈ ఏడాది జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచాయని మంత్రి పేర్కొన్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణాలను మరింత సౌకర్యవంతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దడం వల్ల భక్తులకు మెరుగైన అనుభూతి లభించిందని తెలిపారు. గద్దెల పరిసరాల్లో విస్తరణ, పాదచారులకు సౌకర్యవంతమైన మార్గాలు, శాశ్వత మౌలిక వసతులు జాతర ప్రతిష్టను మరింత పెంచాయని అన్నారు.ఈ అభివృద్ధి పనుల కారణంగా మేడారం మహాజాతరకు మరింత శోభ చేకూరిందని, సంప్రదాయం ఆధునిక సదుపాయాలు సమన్వయమై భక్తుల మనసును ఆకట్టుకున్నాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా చేపట్టిన ఈ పనులు మేడారం చారిత్రక ప్రాధాన్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ మహాజాతరను విజయవంతం చేయడంలో అహర్నిశలు కృషి చేసిన జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సేవకులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి సీతక్క హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. గుడి అభివృద్ధి పనులు ప్రారంభమైన నాటి నుండి కొన్ని శక్తులు పనికట్టుకుని దుష్ప్రచారం చేశాయని, జాతర సందర్భంగా కూడా సోషల్ మీడియా వేదికగా గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశాయని, వారి ప్రచారాన్ని తిప్పి కొట్టి తల్లుల సేవలో భక్తులు తరించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో యుద్ధ ప్రాతిపదికన వంద రోజుల్లోనే మేడారం అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. మేడారం చరిత్రలో సీఎం రేవంత్ రెడ్డి పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు. మేడారం అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన మంత్రివర్గ సహచరులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహనం, సహకారం వల్లే మేడారం జాతర ఇంత ఘనంగా విజయవంతమైందని పేర్కొంటూ, సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్

### కీలక శాఖల కేటాయింపు

**ముంబై, మహా :** మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా దివంగత అజిత్ పవార్ భార్య, ఎన్సీపీ రాజ్యసభ సభ్యురాలు సునేత్రా పవార్ శనివారం నాడు పగ్గాలు చేపట్టారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. అజిత్ పవార్ మరణంతో ఎన్సీపీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా సునేత్ర శనివారం ఉదయం ఎన్నికయ్యారు. ఆ వెంటనే సాయంత్రం 5 గంటలకు రాజ్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రిగా ఆమె ప్రమాణస్వీకారం చేశారు. 'మహాయుతి' సర్కార్‌లో అజిత్ పవార్ నిర్వహించిన మూడు శాఖలను ఆమెకు కేటాయించారు. ఎక్సైజ్ శాఖ, క్రీడలుయువజన సంక్షేమం, మైనారిటీల అభివృద్ధి శాఖలను సునేత్రకు ఫడ్నవిస్ ప్రభుత్వం కేటాయించింది. అయితే అజిత్ పవార్ చేతిలోని మరో కీలకమైన ఆర్థిక శాఖను మాత్రం కేటాయించలేదు. మహారాష్ట్ర బడ్జెట్ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన చేతిలోనే ఉంచుకున్నారు. దీంతో ఆయనే స్వయంగా ఈసారి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఆ తర్వాతే ఎన్సీపీకి ఆర్థిక శాఖను కేటాయించడం కానీ, దానికి బదులుగా మరో శాఖను కానీ కేటాయించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

## ఆపరేషన్ స్మైల్‌తో 5,582 మంది చిన్నారులకు విముక్తి

### అదనపు డీజీపీ చారుసిన్హా

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు లక్ష్యంగా నెల రోజుల పాటు చేపట్టిన 'ఆపరేషన్ స్మైల్ XII' కార్యక్రమం ద్వారా మొత్తం 5,582 మంది చిన్నారులకు విముక్తి కల్పించినట్లు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో జనవరి 1 నుంచి 31 వరకు కొనసాగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 121 సబ్ డివిజనల్ పోలీసు బృందాలు పాల్గొన్నాయని, ఇందులో మొత్తం 605 మంది పోలీసు సిబ్బంది పనిచేశారని ఆమె వివరించారు. ఈ ఆపరేషన్‌లో మహిళా శిశు సంక్షేమ, కార్మిక, ఆరోగ్య శాఖలతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో వ్యవహరించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు డిసెంబరు 29న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల కార్మిక నిరోధక చట్టాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, అనంతరం రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, టీ స్టాళ్ల వంటి ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా రక్షించిన వారిలో 5,108 మంది బాలురు, 474 మంది బాలికలు ఉన్నారని, వీరిలో 2,292 మంది బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సహా సుమారు 15 రాష్ట్రాలకు చెందిన వారని చారుసిన్హా వెల్లడించారు. పొరుగు దేశమైన నేపాల్‌కు చెందిన 43 మంది చిన్నారులను కూడా రక్షించినట్లు తెలిపారు. రక్షించబడిన వారిలో 4,567 మంది బాల కార్మికులుగా, 486 మంది వీధి బాలలుగా, 38 మంది భిక్షాటన చేస్తూ, మరో 491 మంది ఇతర పనుల్లో మగ్గుతూ గుర్తించబడ్డారని పేర్కొన్నారు. చిన్నారులతో పనులు చేయిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించామని, ఈ క్రమంలో 1,480 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసి 1,483 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె వివరించారు. అలాగే కార్మిక శాఖ ద్వారా 1,363 తనిఖీ నివేదికలు జారీ చేసి, కనీస వేతనాల చట్టం కింద నిందితులకు రూ. 41.78 లక్షల జరిమానా విధించామన్నారు. రక్షించిన వారిలో 4,978 మంది చిన్నారులను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని, ఆశ్రయం లేని 604 మందిని రక్షణ గృహాలకు తరలించడంతో పాటు వలస కార్మికుల పిల్లల కోసం 29 అర్బన్ బ్రిడ్జ్ స్కూళ్లలో 2,375 మందిని చేర్పించామని అదనపు డీజీపీ వివరించారు.

## ప్రతి డివిజన్ గెలుపు మనకు ముఖ్యమే

(మొదటిపేజీ తరువాయి)

"ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. జీరో రెబెల్ స్ట్రాటజీ అమలుచేయాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి" అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు.

**ఫిబ్రవరి 4 నుండి రంగంలోకి సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 3 నుండి ప్రచారం ప్రారంభించాలని మొదట భావించగా, ఇపుడు 4 నుండి ప్రారంభించాలని నిర్ణయించారు. అదేరోజు బిజెపి జాతీయ అధ్యక్షుడు నబిన్ కూడా మహబూబ్ నగర్ లో పర్యటిస్తుండడం విశేషం, మిర్యాల గూడ నుండి ముఖ్యమంత్రి ప్రచారం ప్రారంభించనుండగా, నిజామాబాద్ తో ముగించనున్నారు. ప్రతీ మునిసిపాలిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.

## కరీంనగర్ మేయర్, 3 ఛైర్మన్ పీఠాలు బీజేపీవే

**కరీంనగర్, మహా :** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠంతోపాటు 3 మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాలను బీజేపీ విజయం కైవసం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సర్వేల్లో వెల్లడైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకే టిక్కెట్ల విషయంలో అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ లో 80 శాతంపైగా టిక్కెట్లు వారికే ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గెలిచే అవకాశం లేని మిగిలిన స్థానాల్లో మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా చోట్ల టిక్కెట్లు రాని బీజేపీ కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. నామినేటెడ్ పోస్టులతోపాటు పార్టీ పదవులిచ్చి వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తొందరపడి ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ సీనియర్ నేతలు సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను, ఇనుగొండ నాగేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ లో జరిగిన అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధుల వల్లనే అని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ఆగకూడదంటే బీజేపీకి ఓటేసి ఆశీర్వదించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. టిక్కెట్ ఆశించి భంగపడిన కార్యకర్తలను సముదాయించి డివిజన్ లో బీజేపీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేసేలా చూడాలని కోరారు.

## ఒక్క రోజులో కిలో వెండికి లక్ష రూపాయల లాస్

### డాలర్ బలపడటంతో బంగారం, వెండి ధరలు పతనం

**మహా:** వెండి మార్కెట్‌లో ఒక్క రోజులోనే భారీ దెబ్బ తగిలింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో వెండి ధరలు 25% పడిపోయి, కిలోకు దాదాపు రూ.1 లక్ష నష్టం జరిగింది. రికార్డు గరిష్ట స్థాయికి చేరిన తర్వాత వెంటనే ఈ పతనం ఇన్వెస్టర్లను తీవ్రంగా కంగారు పెట్టింది. ఎంసీఎక్స్ వెండి ధరలు ఈ వారం ప్రారంభంలో రూ.4 లక్షల స్థాయికి చేరుకున్నాయి. కానీ నిన్న ఒక్క రోజులోనే రూ.3 లక్షల స్థాయికి దిగి వచ్చాయి. ఇది వెండి చరిత్రలోనే అతిపెద్ద రోజువారీ పతనాల్లో ఒకటి. ఈ పతనానికి ప్రధాన కారణం... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడ్ ఛైర్‌గా కెవిన్ వార్ష్‌ను ఎంపిక చేయడంతో ఫెడ్ స్వతంత్రతపై భయాలు తగ్గాయి. దీంతో, డాలర్ ఇండెక్స్ గత సంవత్సరం మే తర్వాత అతిపెద్ద రోజువారీ పెరుగుదల నమోదు చేసి 97కి చేరింది. బలమైన డాలర్ వల్ల బంగారం, వెండి ధరలు తగ్గాయి. ఇవి డాలర్ ధర పరిధిలో ఉండటం వల్ల విదేశీ కొనుగోలుదారులకు ఖరీదైనవి అవుతాయి.

## 4న రాష్ట్రానికి రానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

### మహబూబ్ నగర్ జిల్లా బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరు

భారీ బహిరంగసభకు బీజేపీ ఏర్పాట్లు.. ఎంవీఎస్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఎంపీ డీకే అరుణ

నబిన్ తొలి పర్యటనకు భారీ ఏర్పాట్లు చేస్తున్న పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

ఈ గ్రౌండ్ అనుకూలంగా ఉంటుందని ఎంపిక చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఎంపీ అరుణ తెలిపారు. ఉమ్మడి జిల్లాతోపాటు, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ నలుమూల నుంచి పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, బూత్ అధ్యక్షులు ,మండల కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు,బీజేపీ వివిధ మోర్చ అధ్యక్షులు,పార్టీ అనుబంధ సంఘాల నాయకులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఎంపీ కోరారు. .నితిన్ నబిన్ మార్గదర్శనంలో తెలంగాణ బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని, పార్టీ బలోపేతం కోసం బీజేపీ జాతీయ అధ్యక్షులు కార్యకర్తలను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నారన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రతి ఒక్క బీజేపీ అభ్యర్థిని గెలిపించుకునే విధంగా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకుని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేద్దామని ఈ సందర్భంగా అరుణ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ పెద్ద ఎత్తున పుంజుకుంటుందని. యువత బీజేపీ వైపు చూస్తుందన్నారు. భవిష్యత్ లో తెలంగాణలో అధికారంలోకి బీజేపీ తీసుకువచ్చేందుకు పని చేద్దామని అరుణ పిలుపునిచ్చారు. ఒక యువ నాయకుడు, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సిన్హా గారు పార్టీ శ్రేణుల్లో ఈ సమావేశం ద్వారా స్ఫూర్తి నింపనున్నారన్నారు.

## నిర్మలమ్మ పద్దు

### తొమ్మిదవ సారి బడ్జెట్ తో రికార్డు

మొట్టమొదటి సారి మంగళగిరి చేనేత వైభవంతో..

**ఢిల్లీ, మహా:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఆమె వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సామాన్యుల నుంచి వ్యాపారవేత్తల వరకు అందరూ ఈ బడ్జెట్ కోసం ఎంతగానో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.అస్థిర భౌగోళిక, రాజకీయ పరిస్థితుల మధ్య ఆర్థిక వృద్ధిని పెంచే లక్ష్యంతో సంస్కరణ చర్యలు బడ్జెట్ లో ఉంటాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఇదే సమయంలో నిర్మలా సీతారామన్ ఓ అరుదైన రికార్డును సృష్టించబోతున్నారు. ఒకే ప్రధానమంత్రి పదవీకాలంలో తొమ్మిది సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఏకైక ఆర్థిక మంత్రిగా సీతారామన్ చరిత్ర సృష్టించబోతున్నారు. నిర్మలమ్మ పద్దుకు అనేక ప్రత్యేకతలుండగా, 2019లో తొలి బడ్జెట్ ప్రసంగం కోసం నిర్మలా సీతారామన్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంగళగిరి చేనేత చీరను ఎంచుకున్నారు. బంగారు రంగు అంచు ఉన్న ఈ గులాబీ రంగు చీర ఆరోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 8బడ్జెట్ లలో 8 చీరెలను ఎంచుకోగా, ఇవి ఫ్యాషన్ ప్రపంచంలో సంచలనమయ్యాయి. ఇపుడు తొమ్మిదోసారి ఏ చీరెతో వస్తుందోనన్న ఆసక్తి కూడా ఉంది. ఇక బడ్జెట్ ను కూడా పేపర్ లెస్ గా మార్చేశారు.

## కోఠి ఎస్‌బీఐ వద్ద కాల్పులు

### వ్యక్తిని గన్‌తో కాల్చిన దుండగులు..రూ.6 లక్షలు అపహరణ

### పోలీసులను ఏమార్చేందుకు డ్రస్ లు మార్చుకున్న అగంతకులు

### అగంతకుల గాలింపు కోసం రంగంలోకి ఐదు బృందాలు




(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంది. ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డిపాటిట్ చేసేందుకు వెళ్లిన రషీద్ అనే వ్యక్తిపై కాల్పులకు తెగబడ్డారు. అనంతరం అతడి వద్ద నుంచి రూ.6 లక్షల నగదుతో ఉడాయించారు. ఈ ఘటనలో రషీద్ కాలికి బుల్లెట్ తగిలి తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు హుటాహుటిన అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రషీద్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. కాల్పుల సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సాయంలో ఆధారాలు సేకరిస్తున్నారు. అక్కడ ఉన్న సీసీ టీవీ కెమెరాల ఆధారంగా విచారణ ముమ్మరం చేశారు. కాల్పులకు తెగబడింది ఎవరు..? డబ్బుల సమాచారం వారికి ఎలా తెలిసింది..? ఇది తెలిసిన వారి పనేనా..? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. త్వరలోనే కాల్పులు జరిగిన దుండగులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు. నిందితులను పట్టుకునేందుకు 5 ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు సుల్తాన్ బజార్ ఏసీపీ వెల్లడించారు. రషీద్‌ను బెదిరించి డబ్బులు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని, అతడు ఎదురు తిరగటంతో కాళ్లపై కాల్పులు జరిపినట్లు తెలిపారు. రషీద్ నాంపల్లిలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారని, వ్యాపారానికి సంబంధించిన డబ్బులు ఏటీఎం మెషీన్‌లో డిపాజిట్ చేసేందుకు వెళ్లిన సమయంలో ఉదయం 7 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుందని తెలిపారు. కచ్చితంగా తెలిసిన వారు, పాత నేరస్తుల పనే అయి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఏటీఎం పరిసరాల్లోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, అందులో లభించే ఆధారాలను బట్టి నిందితులను పట్టుకుంటామని చెప్పారు. గతేడాది నగరంలో కాల్పులు జరిగాయని, ఆ తర్వాత మరోసారి కాల్పులు జరిగినట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున డబ్బులు తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. కాల్పులకు తెగబడి నగదుతో పరారైన దుండగులు పోలీసులను తప్పుదారి పట్టించేందుకు శత విధాలా ప్రయత్నించినట్లు సీసీ పుటేజీలను పరిశీలించిన అనంతరం దర్యాప్తు బృందాలు నిర్ధారణకు వచ్చాయి. కోఠి నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్ వెళ్ళిన అగంతకులు స్టేషన్ లోకి వెళ్ళినట్లే వెళ్ళి తిరిగి బయటకు వచ్చి ఆటోలో సికింద్రాబాద్ వైపు పారిపోయారని గుర్తించారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అగంతకులు ఎటు వైపు వెళ్ళారు, వారి ఆనవాళ్ళు, ముఖ కవలికలు, వారు ఏ భాషలో మాట్లాడుకున్నారు. ఏమని మాట్లాడుకున్నారన్న వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీలైనంత తొందరగా నిందితులను పట్టుకుంటామని పోలీసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.




## కౌశిక్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఫైర్

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు ద్వేషాన్ని బయటపెట్టాయి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు ముస్లింల పట్ల ఆయనకున్న ద్వేషాన్ని బయటపెట్టాయని అన్నారు. మొదటిసారి ఎమ్మెల్యే అయిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే, ఆయనను ఆరెస్సెస్ భావజాలం ఆవహించి ఉంటుందని చురక అంటించారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌లో ఉంటూ కౌశిక్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమని అన్నారు. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని ఉప ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా చేశారని గుర్తు చేశారు.

## ప్రభుత్వ భూములకు అండగా తహసిల్దార్

### కాప్రా మండల పరిధిలో ప్రభుత్వ భూములు కాపాడుతున్న బైరెడ్డి రాజేష్

**కాప్రా, మహా :** మండల పరిధిలోని జవహర్ నగర్ ప్రభుత్వ భూములు సర్వే నంబర్ 205, 364, 497 695, 696 లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణలపై స్పందించిన కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టలు రమేష్, సత్యనారాయణ మరియు రెవిన్యూ సిబ్బంది కలసి జేసీబీ వాహన సహకారంతో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న నిర్మాణాలు కూల్చిచేశారు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణలు చేస్తే కఠిన చెర్యలు తప్పవు అంటూ తహసీల్దార్ గారు రెవిన్యూ అధికార సిబ్బంది హెచ్చరించారు. ప్రభుత్వ భూములు కాపాడడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు అలాగే ప్రభుత్వ భూముల విషయంలో దళరులు ఎవరు భూములు అమ్మిన ప్రజలు కొనుగోళ్లు చేసి మోసపోవద్దు అని సూచిస్తున్నారు. ఏదిఏమైనా ప్రభుత్వ భూములలో వెలుస్తున్న నిర్మాణలు మళ్ళీ జరగకుండా ఉండాలంటే ప్రభుత్వ భూములు కబ్జా చేద్దాం అని ఆలోచిస్తున్న భూకబ్జాదారుల పై కేసులు నమోదు చేయాలని ప్రజల కోరుతున్నారు.



## ముున్సిపల్ ఎన్నికల్లో కీలక పరిణామం


### పోటీలో అమరవీరుడు సంతోశ్ బాబు తల్లి

**హైదరాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే నామినేషన్ల పర్వం పూర్తయింది. ఎన్నికలు జరగనున్న 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు కలిపి మొత్తం 28,456 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రెండు రోజుల్లో 9,276 నామినేషన్లు సమర్పించారు. చివరి రోజైన శుక్రవారం 19,180 దాఖలు కావడం గమనార్హం. అయితే అమరవీరుడు మేజర్ సంతోశ్ బాబు తల్లి కూడా తెలంగాణ మున్సిపల్ బరిలో దిగుతున్నారు. ఈ మేరకు సూర్యాపేట మున్సిపాలిటీ 44వ వార్డు అభ్యర్థిగా బికుమళ్ల మంజుల ఉపేందర్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి చేసిన కేసీఆర్ పాలన తీరు బాగుందన్నారు. అంతేకాకుండా గత పదేళ్లలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నాయకత్వంలో సూర్యాపేటలో ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి జరిగిందని ప్రశంసించారు. ఆలాంటి




బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు మంజుల మీడియాకు వెల్లడించారు. తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో 2020 జూన్ 15న చైనా బలగాలతో జరిగిన ఘర్షణలో భారత సైన్యానికి చెందిన కల్నల్ సంతోశ్ బాబు అమరవీరుడయ్యారు. ఈయనతో సహా 20 మంది సైనికులు వీర మరణం పొందారు. గల్వాన్ ప్రాంతంలో '16 బిహార్' రెజిమెంట్ కల్నల్ సంతోశ్ బాబు కమాండింగ్ అధికారి (సీవో)గా ఉన్నారు. దాదాపు నెల రోజులు జరిగిన ఉద్రిక్త పరిస్థితుల వల్ల రెండు దేశాలూ పోటాపోటీగా అక్కడికి బలగాలను మోహరించారు. అక్కడ వేడిని చల్లార్చేందుకు ఇరు దేశాల లెఫ్టినెంట్ జనరల్ స్థాయి సైనికాధికారుల మధ్య చర్చలు జరిగాయి. ఒప్పందం ప్రకారం రెండు దేశాలు తమ సరిహద్దుల నుంచి అదనపు బలగాలను వెనక్కి తరలించాల్సి ఉంది. కానీ చైనా సైనికులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసినట్లే చేసి మళ్లీ శిబిరాలు ఏర్పాటు చేసింది. కానీ ఒప్పందం ప్రకారం వాటిని తొలగించాలని '16 బిహార్' దళం వెళ్లింది. అయినా చైనా దళాలు వినిపించుకోలేదు. ఈ విషయం సంతోష్‌బాబుకు బిహార్ దళం చెప్పింది. దీంతో సంతోశ్ బాబు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడ్డ సంతోశ్ బాబు చనిపోయారు. కాగా, సంతోశ్ బాబు నేతృత్వంలోని కేవలం 100 మంది సైనికులు చైనాకు చెందిన దాదాపు 300 మంది సైనికులపై విరుచుకుపడ్డారు. పోరులో పైచేయి సాధించి డ్రాగన్ తోకముడిచేలా చేశారు. చివరి శ్వాస వరకు సంతోశ్ బాబు భరతమాతకు చేసిన సేవను 'మహావీరచక్ర'తో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది.

## మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్



(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నల్లపాడు పోలీసులు అంబటిపై కేసు నమోదు చేశారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ, పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి ప్రత్యేక వజ్రవాహనంలో అక్కడి నుంచి తరలించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు కూడా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంబటి వ్యాఖ్యలను మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, హోం మంత్రి అనిత, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. అంబటి వ్యాఖ్యలు 'దుర్మార్గం', 'నీచం' అని అభివర్ణిస్తూ, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా అరెస్ట్ అనంతరం అంబటి ఇంటికి అల్లరి మూకలు నిప్పుపెట్టారు. భయం అంటే ఏంటో చూపిస్తాం అంటూ కారు దగ్ధం చేయడంతో పాటు ఇంటికి కూడా నిప్పుపెట్టారు.

# వారంలో 43 లక్షల ఆదాయం




**ఆదిలాబాద్ మహా:** మున్సిపల్ ఎన్నికలలో పోటీకి నో డ్యూస్ సర్టిఫికెట్ ఉండాలన్న నిబంధన ఆదిలాబాద్ పురపాలక సంఘానికి కొంత ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. వారంలో 43 లక్షల రూపాయలు వసూలయ్యాయి. చాలాఏళ్లు గా పెండింగ్ లో ఉన్న ప్రాపర్టీ, వాటర్ టాక్స్ బకాయిలలో కొంత ఎట్టకేలకు వసూలయ్యాయి. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ప్రతిపాదకులు మున్సిపల్ కు పెండింగ్ బకాయిలేమీ లేవు అన్నట్లుగా నోడ్యూస్ సర్టిఫికెట్స్ తప్పనిసరి కావడంతో క్యూలు కట్టి మరీ బకాయిలు చెల్లించారు. ఇందుకోసం మున్సిపల్ ఆఫీస్ లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. బకాయిలు చెల్లించిన వారికి మున్సిపల్ శాఖ నుండి నోడ్యూస్ సర్టిఫికెట్ అందించారు. మొత్తం 1,350 మంది తమ పన్ను బకాయిలు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్లు పొందారు. దీంతో మున్సిపల్ కు ప్రాపర్టీ టాక్స్ ద్వారా 15 లక్షలు, వాటర్ బిల్స్ ద్వారా 28 లక్షల రూపాయలు సమకూరాయి. మొత్తం గా వారం వ్యవధిలో బల్దియాకు పెండింగ్ టాక్స్ ల రూపంలో 43లక్షల రూపాయల ఆదాయం వచ్చింది.

# స్క్రూటినీ పారదర్శకంగా...కలెక్టర్



**ఆదిలాబాద్ మహా:** నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వార్డుల వారీగా ఏర్పాటు చేసిన నామినేషన్ల పరిశీలన కేంద్రాలను సందర్శించి, సౌకర్యాలను, భద్రతా ఏర్పాట్లపై ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల అర్హతలు, సమర్పించిన పత్రాలను నిశితంగా తనిఖీ చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద సిబ్బందికి కావాల్సిన ఎన్నికల మౌలిక వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం వార్డుల వారీగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో స్క్రూటినీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, ఎన్నికల విభాగం సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్యాభివృద్ధి

**మంచిర్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా వయోజన విద్య అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, గ్రామపంచాయతీ సర్పంచ్ మిట్టపల్లి రామ్ రెడ్డి లతో కలిసి ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ అక్షరాలు దిద్ది చదువు నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని చెప్పారు. 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని వెల్లడించారు. అలా చదువుకున్నప్పుడే సమాజంలో గౌరవ స్థానం దొరుకుతుందని తెలిపారు. ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలకు నిరక్షరాస్యులు ప్రతి ఒక్కరు రావడమే కాకుండా చదువు నేర్చుకుని 100 రోజుల్లో అక్షరాస్యులుగా తయారు కావాలని సూచించారు. అక్షర వికాసం పుస్తకంలోని 16 చాప్టర్ లను 100 రోజులలో పూర్తి చేయాలని తెలిపారు. వయోజన విద్య నేర్చుకుంటున్న మహిళా సంఘ సభ్యులు అక్షరాస్యతతో కీలక జీవన నైపుణ్యాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర కేంద్రం వాలంటీర్లు శిరీష, దాసరి శ్యామల, జె డి ఎం రామచందర్, ఎ పి ఎం వెంకటేష్, సి సి లు మోహన్, కృపవర్ణ, రాజమణి, వి ఓ ఎ లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వనానికి తరలిన సమ్మక్క, సారాలమ్మలు

**జాతరను విజయవంతం చేసిన కార్మికులకు, ప్రజలకు ధన్యవాదాలు**




**మందమర్రి, మహా :** గత నాలుగు రోజులుగా రామకృష్ణాపూర్ పాలవాగు ఆర్.కే1 ఏ వద్ద నిర్వహించిన సమ్మక్క, సారలమ్మలు శనివారం వనానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగాసమ్మక్క, సారలమ్మ కుంకుమభరినీలను గంపలు పెట్టి గడిచిన నాలుగు రోజులలో తాము తెలిసి తెలియక తప్పులు చేస్తే పెద్ద మనసుతో క్షమించాలని కోరారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ జాతరను నాలుగు రోజులపాటు విజయవంతం చేసిన కార్మిక కుటుంబాలకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మరో రెండు సంవత్సరాలకు వచ్చే జాతరను కూడా సమ్మక్క, సారలమ్మ భక్తులు విజయవంతం చేయాలని కోరారు. ఏరియాలోని కార్మికులకు ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలని, గని ప్రమాదాలు జరగకూడదని, వీలైనంత త్వరలో శ్రావణ్ పల్లి గని అనుమతులు, రామకృష్ణాపూర్ ఓసి ప్రాజెక్టు పనులకు అనుమతులు రావాలని దేవతలను కోరుకున్నట్లు జియం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం (ఏఐటియుసి) నేతలు దాగం మల్లేష్, డీజీఎం పర్సనల్ అశోక్, ఐ ఈ డి (డీజీఎం) కిరణ్ కుమార్, సుదర్శన్, ఇప్పకాయల లింగయ్య,సి వి రమణ, అధికారులు. పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

# ఏరియా ఉత్పత్తి లక్ష్యసాధనలో కే.కే5 గని ప్రథమం

**జనవరి నెల ఉత్పత్తి ఉత్పాదకత వివరాలు వెల్లడించిన జీఎం**




**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా ఉత్పత్తి లక్ష్యసాధనలోకే.కే5 గని ప్రథమం స్థానంలో నిలిచిందని స్థానిక జిఎం ఎన్ రాధాకృష్ణ అన్నారు. శనివారం జనవరి మాసం ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు 80 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని చెప్పారు. అంతేకాకుండా జనవరి 28 నుంచి 31 వరకు మందమర్రి ఏరియా పాల చెట్టు ప్రాంతంలో శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర ను ఘనంగా జరుపుకున్నామని వెల్లడించారు. ఇకనుండి ఏరియాలో రోజుకు మూడు రేకుల బొగ్గులను వ్యాగన్ల ద్వారా తరలించడం లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. నెలకు 90 రేకులు పంపించేందుకు తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. కాసిపేట 2 గనిలో మైండ్ రైడింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఇది అందుబాటులోకి వస్తే కార్మికులకు నడక ప్రయాస తగ్గుతుందని చెప్పారు. అంతేకాకుండా కార్మికుల సౌకర్యార్థం ఫిజియోథెరపీ సెంటర్ ను కేకే డిస్పెన్సరీలో ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కే.కే.ఓ.సి బ్లాస్టింగ్ లో లోపాల గురించి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. సంస్థకు వచ్చిన అనుమతుల కంటే తక్కువ మోతాదులో బ్లాస్టింగ్ పనులు చేస్తున్నట్లు వివరించారు. ఇకపోతే ఏరియా నుండి నాలుగు చెరువులను ఎంపిక చేసుకొని వాటి పూడిక తీత మరమ్మత్తులకు ఒక కోటి 9 లక్షల రూపాయలు విడుదల చేశామని అన్నారు. ఈ రూపాలతో ఆదిల్ పేట, అమరవాది, లింగాపూర్, ఆకనపల్లి, భూదాకాలం ఊర చెరువుల పూడిక తీత పనులకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రానున్న రెండు నెలల్లో సింగరేణి పరివాసిక ప్రాంతంలో ఉచిత మెడికల్ క్యాంపు, బ్యూటీషియన్ ఉచిత కోర్సులను అందించాలని సంస్థకు ప్రతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు రాగానే ఈ పనులను త్వరగా తిను పూర్తి చేస్తామని భరోసా పలికారు. ఏరియాలో చాలామంది యువకులు నెలల వారిగా విధులకు గైరాజరవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వీరు రోజువారీగా విధులకు వచ్చేలా వారి కుటుంబ సభ్యులు యూనియన్ నాయకులు, సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం జి ఎల్ ప్రసాద్, ఏరియా జిఎం ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి ఝా, ఐ ఈ డి జి ఎం పర్సనల్ అశోక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సేవ ముసుగులో.. రియల్ దందా!

**జెండాల మాటున కాసుల వేట.. బలిపశువులవుతున్న అమాయక యువత..**
**దోపిడీ సొమ్ము.. నోట్ల రూపంలో మీ ముంగిటికి! ప్రజలారా మేల్కొనండి..**


బలిపశువులవుతున్న అమాయక యువత!

**నల్లగొండ మహా:** నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికల వేళ రాజకీయం రంగు మారుతోంది. సిద్ధాంతాలు గాలికి కొట్టుకుపోయాయి.. జెండాలు కేవలం అలంకారప్రాయంగా మారాయి. లోపల మాత్రం అంతా 'రియల్' మాయాజాలం. ఈ ఎన్నికలు పార్టీల మధ్య జరుగుతున్నాయనుకుంటే పొరపాటే.. ఇవి పక్కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు. గెలిచేది ఏ పార్టీ అయినా.. లాభపడేది మాత్రం ఆ వ్యాపార సామ్రాజ్యాలేనన్న నగ్నసత్యం నగర వీధుల్లో చర్చనీయాంశంగా మారింది.

**జెండాల మాటున కాసుల వేట..**

అధికార పార్టీ మొదలుకొని.. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ వరకు అంతా ఒకే బాటలో పయనిస్తున్నాయి. బయటికి విమర్శలు చేసుకుంటున్నా, లోపల మాత్రం "నువ్వు గెలిచినా.. నేను గెలిచినా.. మన వ్యాపారాలకు డోకా ఉండకూడదు" అన్న లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. తమ వెంచర్లకు, భూ దందాలకు అండగా ఉండేవారికి మాత్రమే పార్టీల బీఫారాలు దక్కడం వెనుక ఉన్న మర్మం ఇదేనని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చి మార్పు తేవాలని తపిస్తున్న కొందరు యువకులు, మధ్యతరగతి సామాన్యులు ఈ 'డబ్బున్న రాజకీయ బిచ్చగాళ్ల' ధాటికి తట్టుకోలేకపోతున్నారు. కోట్లు కుమ్మరించే వ్యాపారుల మధ్య.. ఉన్నది ఊడ్చిపెట్టి పోటీకి దిగిన అమాయక అభ్యర్థులు ఆర్థికంగా దివాలా తీసే ప్రమాదం కనిపిస్తోంది. అనుభవజ్ఞులు కొందరు ఈ పరిస్థితిని చూసి ముందే తప్పుకోగా, కొత్తగా బరిలో ఉన్నవారు ఈ రాజకీయ వ్యాపార చక్రబంధంలో చిక్కుకుపోతున్నారు.

> **ప్రజలారా.. మేల్కొనండి!**
>
> **ఓటు వేసే ముందు ఆలోచించండి. పార్టీల ముసుగులో వస్తున్న వ్యాపారవేత్తలకు బుద్ధి చెప్పకపోతే.. నల్లగొండ భవిష్యత్తు రియల్ ఎస్టేట్ మాఫియా చేతుల్లోకి వెళ్లడం ఖాయం. మీ కష్టసుఖాల్లో తోడుండే వారికి, నిస్వార్థంగా సేవ చేసే వారికే పట్టం కట్టండి. "డబ్బున్న రాజకీయ బిచ్చగాళ్లు మీ ఇంటికి వస్తున్నారు.. జాగ్రత్త! మీ ఓటు మీ ఆయుధం.. దాన్ని వ్యాపారులకు అమ్ముకోకండి." అని అంటున్న రాజకీయ మేధావులు.**

**దోపిడీ సొమ్ము.. నోట్ల రూపంలో మీ ముంగిటికి!**

ఓటర్లను ప్రలోభపెట్టడానికి నేతలు పంచుతున్న డబ్బు ఎక్కడిది?భూముల కబ్జా.. సామాన్యుల ఆస్తులను కొల్లగొట్టి పోగేసిన అక్రమ సంపాదన. వెంచర్ల దోపిడీ.. నిబంధనలు తుంగలో తొక్కి సంపాదించిన కమీషన్లు. ఇప్పుడు అదే సొమ్మును ఓటుకు నోటు రూపంలో ఇచ్చి, మళ్లీ ఐదేళ్లపాటు నగరాన్ని దోచుకోవడానికి ఈ రాజకీయ వ్యాపారులు ప్లాన్ చేస్తున్నారా?

# నల్లగొండ జిల్లాలో ఘోరం..

**వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని ప్రియుడి భార్య పెట్రోల్ పోసి నిప్పంటించిన మహిళ**



**నల్గొండ మహా:** నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లి గ్రామంలో శనివారం అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఆరు నెలల పసికందును చావుబతుకుల మధ్యకు నెట్టింది. ప్రియుడి భార్యపై ఓ మహిళ పెట్రోల్ పోసి నిప్పంటించగా, ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది.ఘటన వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తికి మమత (25)తో వివాహమైంది. వీరికి ఆరు నెలల చిన్నారి ఉంది. అయితే, నగేష్ అదే గ్రామానికి చెందిన సుజాత అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై గత కొంతకాలంగా నగేష్ భార్య మమతకు, సుజాతకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ సంబంధానికి మమత అడ్డు వస్తోందని భావించిన సుజాత, ఆమెను వదిలించుకోవాలని పథకం వేసింది.శనివారం మమత ఇంట్లో ఉన్న సమయంలో సుజాత పెట్రోల్ తో అక్కడికి చేరుకుంది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన సుజాత, వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను మమతపై పోసి నిప్పంటించింది. ఆ సమయంలో తల్లి ఒడిలోనే ఉన్న ఆరు నెలల చిన్నారికి కూడా మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు చెలరేగడంతో మమత తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. తల్లిని రక్షించే ప్రయత్నంలో చిన్నారికి 80 శాతం కాలిన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే స్పందించి చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ పసిపాప ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. హత్య అనంతరం నిందితురాలు సుజాత నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయింది. సమాచారం అందుకున్న నాంపల్లి సీఐ రాజు, ఎస్సై లింగారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ అమానవీయ ఘటనతో కేతపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అక్రమ సంబంధం కోసం పసిపాపను కూడా చూడకుండా ఇంతటి దారుణానికి ఒడిగట్టిన సుజాతను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు నిరసన కార్యక్రమం

**పైళ్ళ శేఖర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు**



**భువనగిరి, మహా:** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్యమ నాయకుడు కేసీఆర్ కు సిట్ విచారణ పేరుతో నేడు ఆదివారం కెసిఆర్ ను విచారిస్తున్న సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు భువనగిరి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామ శాఖలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు

# అనుమానస్పదంగా వ్యక్తి మృతి



**వలిగొండ, మహా:** అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని పొద్దటూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన పూర్తి వివరాల ప్రకారం వలిగొండ మండలంలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన బుంగమట్ల శ్రీనివాస్ (26)శుక్రవారం తమ్ముడు శివకుమార్ తో కలిసి వారి పొలం దగ్గరికి వెళ్లారు తదనంతరం తమ్ముడుతో శ్రీనివాస్ గొర్ల దగ్గర ఉంటాను తర్వాత వస్తానని చెప్పడంతో శివకుమార్ ఇంటికి వచ్చాడు తదనంతరం అన్న శ్రీనివాస్ రాకపోయేసరికి తమ్ముడు శివకుమార్ ఫోన్ చేయగా ఫోన్ రింగ్ అయిన కూడా లేపకపోయేసరికి తండ్రి నరసింహతో కలిసి గొర్ల దగ్గరికి వెళ్లి చూడగా శ్రీనివాస్ నోటి నుండి నురుగు వస్తూ స్పృహ కోల్పోవడంతో వెంటనే భువనగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడినుండి హైదరాబాదుకు తరలించగా శనివారం మృతి చెందారు ఇట్టి విషయంపై మృతిని తండ్రి బుంగమట్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.

# మిర్యాలగూడలో బత్తుల ఫ్యామిలీ ప్యాకేజీ!





**నల్గొండ మహా ప్రతినిధి:** మిర్యాలగూడ కాంగ్రెస్ రాజకీయాల్లో 'కుటుంబ' పాలన సెగలు రేపుతోంది. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) తన నియోజకవర్గంలో అనుసరిస్తున్న తీరు ఇప్పుడు అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. మున్సిపల్ ఎన్నికల వేళ కార్యకర్తలకు కాకుండా తన కుటుంబ సభ్యులకే 'ప్యాకేజీ' తరహాలో టికెట్లు ఇచ్చుకోవడం పార్టీలో పెను దుమారానికి దారితీసింది.వార్డు కౌన్సిలర్ టికెట్ల కేటాయింపులో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన మార్కు రాజకీయం ప్రదర్శించారు. పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి,ఇంటిల్లిపాదీని బరిలోకి దింపి పట్టం కట్టారు. 39వ వార్డు నుంచి తన సతీమణి మాధవిని బరిలోకి దింపగా, 40వ వార్డు నుంచి పెద్ద కుమారుడు సాయి ప్రసన్న, 28వ వార్డు నుంచి చిన్న కుమారుడు ఈశ్వర్ గణేష్ నామినేషన్లు దాఖలు చేశారు. ఒకే ఇంట్లో నుంచి నలుగురు (ఎమ్మెల్యేతో కలిపి) పదవుల్లో ఉండాలనుకోవడంపై సామాన్య కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**జానారెడ్డికి చెక్ పెట్టే వ్యూహమేనా?**

జిల్లాలో సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి వర్గానికి ఇక్కడ గట్టి పట్టుంది. మున్సిపాలిటీలో తన పట్టు కోల్పోకుండా ఉండాలన్నా, జానారెడ్డి వర్గాన్ని కట్టడి చేయాలన్నా తన కుటుంబ సభ్యులే కీలక స్థానాల్లో ఉండాలని ఎమ్మెల్యే భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఈ 'చెక్' రాజకీయం కాస్తా తిరగబడటంతో పార్టీలో అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి.ఎమ్మెల్యే తీరుపై టీపీసీసీ తీవ్ర స్థాయిలో స్పందించింది. "పార్టీ ఏమైనా నీ జాగీరా?" అంటూ అధిష్టానం బత్తులపై ఫైర్ అయినట్లు సమాచారం. నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని గట్టిగా మందలించినట్లు తెలుస్తోంది. అటు అసమ్మతి వర్గం కూడా ఎమ్మెల్యేతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. తమకు టికెట్లు రాకపోవడం వెనుక ఎమ్మెల్యే కుట్ర ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్వతంత్రులుగానైనా బరిలో ఉంటామని హెచ్చరిస్తున్నారు.

**అసంతృప్తులకు 'రఘువీర్' బుజ్జగింపులు..**

మున్సిపల్ ఎన్నికల వేళ ఈ అసమ్మతి పార్టీ కొంప ముంచుతుందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డిని రంగంలోకి దింపి, అసంతృప్త నేతలను ప్రసన్నం చేసుకోవాలని ఆదేశించారు. దీంతో ఎంపీ రఘువీర్ రెడ్డి మిర్యాలగూడలో మకాం వేసి, అసమ్మతి వర్గంతో చర్చలు జరుపుతున్నారు. భవిష్యత్తులో వారికి తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇస్తూ శాంతింపజేసే ప్రయత్నం చేస్తున్నారు."జెండా మోసిన వాళ్లం మేము పదవులు అనుభవించేది వాళ్లా?" అంటూ ద్వితీయ శ్రేణి నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటం ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**




**మంచిర్యాల, మహా :** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈ. ఆర్. ఓ. లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు ముందు గా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ 11కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకుగాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. 40 సంవత్సరాల లోపల ఉన్న మహిళల మ్యాపింగ్ ను వారి తల్లిదండ్రుల వివరాల ఆధారంగా చేయాలని, బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని, బ్లర్డ్ ఫొటోస్, డబుల్ ఎంట్రీలపై దృష్టి సాధించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అజాగ్రత్త వహిస్తే కఠిన చర్యలు..

**శిక్షణ తరగతుల్లో**
**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం..**



**నల్గొండ మహా:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ) పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్ లో ఎన్నికల సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరుగుతాయని, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తరహాలోనే అన్ని కఠిన నిబంధనలు ఇక్కడ కూడా వర్తిస్తాయని గుర్తుచేశారు.ఎన్నికల విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. సిబ్బందికి ఆయన పలు కీలక సూచనలు చేశారు..డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఇచ్చే ఎన్నికల సామాగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలి. బాక్సుల సీలింగ్ ప్రక్రియను నిబంధనల మేరకే పూర్తి చేయాలి. ప్రిసైడింగ్ అధికారుల డైరీని రెండు కాపీల్లో అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలి. ఓటర్లు బ్యాలెట్ పేపర్ తీసుకున్న తర్వాత దానిని బాక్సులో వేస్తున్నారో లేదో గమనించేందుకు ఒక ఏపీఓను ప్రత్యేకంగా కేటాయించాలి. పోలింగ్ కేంద్రంలోకి ఒకేసారి ఐదుగురికి మించి ఓటర్లను అనుమతించకూడదు. అంధులకు సహాయకులుగా వచ్చే వారు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండిన వారై ఉండాలి. ఓటింగ్ కంపార్ట్ మెంట్ లో మార్కింగ్ సీలు తప్ప ఇతర వస్తువులేవీ ఉండకూడదని అధికారులకు దిశా నిర్దేశం చేసారు.

**బాధ్యతారాహిత్యంగా ఉంటే చర్యలు తప్పవు**

రాష్ట్ర ఎస్సీఈఆర్టీ సంచాలకులు, మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు జి. రమేష్ మాట్లాడుతూ.. బ్యాలెట్ పేపర్ అకౌంట్, పీఓ డైరీలను తప్పులు లేకుండా పూరించాలని సూచించారు. తమకు కేటాయించిన వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లే వచ్చాయా లేదా అనేది ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పొరపాట్లు జరిగితే పీఓలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అన్ని ఫారాలను క్షుణ్ణంగా నింపాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్ సిబ్బందికి పలు సూచనలు చేయగా.. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇంచార్జ్) వై. అశోక్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, డీఈఓ భిక్షపతి మరియు మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# తెలంగాణ పాలిటిక్స్ లో ట్యాపింగ్ మలుపు

**తెలంగాణ రాజకీయాల్లో ఓ కీలక పరిణామం. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఆదివారం సిట్ అధికారులు విచారించనున్నారు. గతంలో కాళేశ్వరం విచారణకు కేసీఆర్ హాజరై వాంగ్మూలమిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసు అందుకు భిన్నమైంది. రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి కేసీఆర్ అండ్ ఫ్యామిలీ ట్యాపింగ్ మార్గం ఎంచుకుని అనేక రకాలుగా ప్రత్యర్థులను కట్టడి చేశారన్నా ఆరోపణలు గత ఐదారేళ్ళుగా విపక్షాలు చేస్తుండగా, ఇపుడు విచారణ జరగనుంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిందని అప్పటి ప్రతిపక్ష నేతలంతా చెప్పడంతో పాటు వందల స్టేట్ మెంట్లు రికార్డుచేయగా, ఇపుడు కేసీఆర్ ను ఏం ప్రశ్నిస్తారు? విచారణతో ముగుస్తుందా? అరెస్ట్ ల వకు దారితీస్తాయా? అన్నది చూడాల్సి ఉంది. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని, రేవంత్ స్థిరమైన వ్యూహాత్మక నాయకత్వం కాంగ్రెస్ పట్టును కొనసాగిస్తున్నదని ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది సర్వే తేల్చిచెప్పింది. ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి హవా మరింత పెరిగిందని ఈ సర్వే స్పష్టం చేసింది.**

**- తెలుగు నాట తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి 'వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అధ్యాయం తెరలేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ను సిట్ అధికారులు విచారించనున్న నేపథ్యంలో, ఈ అంశం కేవలం ఒక కేసుగా కాకుండా రాజకీయ చరిత్రలో ఓ మలుపుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు కేసీఆర్ హాజరై వాంగ్మూలమిచ్చారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసు ఆ స్థాయిలో సాధారణం కాదు. ఇది ప్రభుత్వ అధికార దుర్వినియోగం, ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘన, రాజకీయ ప్రత్యర్థులపై నిఘా వంటి తీవ్రమైన ఆరోపణలతో కూడిన అంశం కావడంతో విచారణ ఎలా ఉంటుందని రాజకీయవర్గాలు గమనిస్తున్నాయి.

గత ఐదారేళ్లుగా ప్రతిపక్షాలు చేస్తున్న ప్రధాన ఆరోపణ ఏమిటంటే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, చివరికి ప్రభుత్వ వ్యవస్థలోని కొందరిపై కూడా ఫోన్ ట్యాపింగ్ ద్వారా నిఘా పెట్టారన్నది. ప్రస్తుతం కేంద్రమంత్రులుగా ఉన్న వారితో పాటు సొంతపార్టీ ఎమ్మెల్యేలు, నేతలు కూడా అనేక సందర్భాల్లో వాపోయారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అప్పటి ఇంటెలిజెన్స్ అధికారులు చేసిన వేధింపులకు లెక్కే లేదు. ఇప్పటికే వందల స్టేట్‌మెంట్లు రికార్డయ్యాయి.

అప్పటి ప్రతిపక్ష నేతలందరూ "ఇది వ్యవస్థాగతంగా జరిగిన నిఘా" అని చెబుతున్నారు. అయితే విచారణ ఎక్కడితో ముగుస్తుంది? కేసీఆర్ విచారణ వరకు బాధ్యత ఆగుతుందా? లేక అరెస్టులు, ఛార్జ్‌షీట్లు దాకా వెళ్తుందా? ఇది చట్టపరమైన విచారణ మాత్రమేనా? లేక ఇతర లెక్కలున్నాయా? అన్న చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ జరిగిందా.. లేదా అన్నది అధికారికంగా ఎవరూ నిర్ధారించలేదు. కానీ ప్రజల్లో మాత్రం ఇతరుల ఫోన్లు వినడం అనే అంశంపై తీవ్ర ఆగ్రహం, కోపం ఉన్నాయి. కుంభకోణాలు, అవినీతి కంటే కూడా దీనిని పెద్దగా చూస్తున్నారు. ఈ క్రమంలో దీనిని సిట్ ఏ విధంగా ఎండ్ చేస్తుందన్నది పెద్ద సవాల్,




తెలంగాణ ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌కు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన పాత్రను ఎవరూ కాదనలేరు. ఖండించలేరు. అయితే అధికారంలో ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలే నేడు ఆయన రాజకీయ వారసత్వాన్ని ప్రశ్నించే స్థితికి తీసుకొచ్చాయనే చర్చ జరుగుతున్నది. గతంలో రేవంత్ రెడ్డి, బండిసంజయ్, కోదండరాం, ఈటల రాజేందర్, రఘునందన్ వంటి అనేక నేతలను ఇబ్బందిపెట్టారన్న అభిప్రాయం ఉంది. రాజకీయాల్లో ఇవి సాధారణం అనుకున్నా, అధికారం ప్రజలు మార్చినపుడు ప్రతిస్పందనకు ప్రిపేరయి ఉండాలని ఆధునిక రాజకీయాలు చెబుతున్నాయి.

విచారణ అనేది చట్టానికి పరీక్ష...
ఫలితం అనేది ప్రజాస్వామ్యానికి సమాధానం.
ఈ విచారణ నిజంగా ముగింపుని ఇస్తుందా? లేక మరో రాజకీయ ఎపిసోడ్‌గా మిగిలిపోతుందా? అన్నది తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రశ్నగా నిలవనుంది.

తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే తేల్చిచెప్పింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి స్థిరమైన, వ్యూహాత్మక నాయకత్వం కాంగ్రెస్ పట్టును బలోపేతం చేస్తోందన్నది సర్వే సారాంశం. "వ్యూహం ఉన్న నాయకత్వం... కాలాన్ని ఎదుర్కొనే రాజకీయాన్ని నిర్మిస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన విమర్శలను, అధికారంలోకి వచ్చిన తరువాత ఎలా అమలు చేస్తున్నారన్నదే రేవంత్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తోంది. ప్రజల కోణంలో, ప్రజల్లో ఒకడిగా సాగిస్తున్న పాలనకు ప్రజా మద్దతు లభిస్తోందని సర్వే స్పష్టం చేస్తోంది. ఇంకా అధికార ప్రభావం నుండి బయటకు రాలేక బీఆర్ఎస్ నేతలు ఇబ్బందిపడుతున్న పరిస్థితి కనబడుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి హవా మరింత బలపడిందని అదే సర్వే స్పష్టం చేసింది. అనుభవం, వ్యవస్థలపై పట్టుతో చంద్రబాబు మరోసారి రాజకీయంగా పైచేయి సాధిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమిని పెద్దన్నలా చంద్రబాబు వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్తుండగా, కూటమిగా ఉన్నంతకాలం ఎదురులేదని స్పష్టమవుతోంది. అమరావతి కుదురుకుంటుండడం, పెట్టుబడుల ప్రచారం ఏపీ లో బాబే భవిష్యత్తు అన్న బ్రాండ్ ను బలపరుస్తున్నాయి.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

# కరీంనగర్ కార్పోరేషన్ లో వెలిచాల దూకుడు

## కాంగ్రెస్‌కు మేయర్ పీఠమే లక్ష్యంగా గేమ్ ప్లాన్

### కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి నియామకంతో మారిన సీన్
### అమాంతం పెరిగిన కాంగ్రెస్ గ్రాఫ్.. భారీగా చేరికలు ప్రచార పర్వంతో శ్రేణుల్లో జోష్..

(మహా - కరీంనగర్ )

కరీంనగర్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నిన్నటి వరకు నిస్తేజంగా కనిపించిన కాంగ్రెస్ పార్టీ, నేడు దూకుడుగా ముందుకు సాగుతోంది. దీనికి ప్రధాన కారణం సీఎం రేవంత్ రెడ్డి నమ్మకమైన సైనికుడు, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా వెలిచాల రాజేందర్ రావు బాధ్యతలు చేపట్టడమే. రాజేందర్ రావు కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకొచ్చేందుకు నడుం బిగించారు. పార్టీని గ్రౌండ్ లెవెల్‌లో బలోపేతం చేస్తున్నారు. కార్పొరేషన్ ఎన్నికల వేళ.. మేయర్ పీఠమే లక్ష్యంగా..అన్నీ తానై ముందుండి మంత్రాంగం చేస్తున్నారు. అభ్యర్థులకు వెన్నుదన్నుగా ఉంటున్నారు, కాంగ్రెస్ నేతలకు.. క్యాడర్ కు అండదండగా నిలుస్తున్నారు. భరోసా నింపుతున్నారు. కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి నియామకంతో కరీంనగర్ ఒక్కసారిగా సీన్ మారిపోయింది. కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. బీజేపీ బీఆర్ఎస్ పార్టీల నుంచి భారీ స్థాయిలో నేతల చేరికలు వెలిచాల సమక్షంలో జరిగాయి. దీంతో వాడవాడనా బస్తీబాట పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ప్రతి డివిజన్‌లో సమీక్షలు, ప్రతి వార్డులో పర్యటనలు చేస్తూ, ప్రతి కార్యకర్తతో ప్రత్యక్షంగా సంభాషిస్తున్నారు. దీంతో గ్రౌండ్ లెవెల్‌లో పార్టీ పూర్తిస్థాయిలో బలపడింది. కరీంనగర్ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. నగర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్ముతున్నారు. కాంగ్రెస్ పట్ల పట్టణ ప్రజలు పాజిటివ్‌గా ఉండడంతో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునే దిశగా వెలిచాల ముందుకు సాగుతున్నారు. దీంతో తమ పార్టీలకు బీటలు పడడం ఖాయమని తేలిపోవడంతో బీఆర్ఎస్ బీజేపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

**క్యాడర్‌లో నూతనోత్సాహం..**

ఒకప్పుడు నిరాశలో ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్లో ఇప్పుడు జోష్ పొంగిపొర్లుతోంది. కరీంనగర్ కాంగ్రెస్ ఒక బలమైన నాయకుడికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం కలిసొచ్చింది. 'ప్రచార పర్వం'లా సాగుతున్న చేరికల కార్యక్రమాలు సాగుతోంది. కాంగ్రెస్‌లో భారీగా నేతలు, కార్యకర్తలు చేరుతున్నారు. గల్లీ గల్లీకి కాంగ్రెస్ సందేశం చేరుతోంది. ప్రజల సమస్యలను నేరుగా వినిపిస్తూ, వెంటనే పరిష్కారానికి ప్రయత్నించడం పార్టీకి మంచి మైలేజ్ ఇస్తున్నది. కరీంనగర్ కాంగ్రెస్ మంచి రోజులు వస్తున్నాయి. ఇక్కడ ఎంపీ, ఎమ్మెల్యే ప్రాతినిధ్యం లేకుండా పోవడంతో ఆ భర్తీని మేయర్ పీఠం దక్కించుకోవడం ద్వారా తీర్చుకోవచ్చని వెలిచాల భావిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంది కానుక కరీంనగర్ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేస్తున్నారు.

**అమాంతం పెరిగిన కాంగ్రెస్ గ్రాఫ్**

వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలో కాంగ్రెస్ గ్రాఫ్ అమాంతంగా పెరుగుతోంది. బస్తీబాట, ఇంటింటి ప్రచారం, యువతతో ప్రత్యేక సమావేశాలు – ఇలా ప్రతి వర్గాన్ని టచ్ చేస్తూ రాజకీయ వ్యూహం అమలు చేస్తున్నారు. మేయర్ పీఠమే లక్ష్యంగా పక్కా ప్లానింగ్‌తో అడుగులు వేస్తున్నారు. అన్నీ తానై ముందుండి అభ్యర్థులకు దిశా నిర్దేశం చేస్తూ ముందుకు సాగుతున్నారు.

**కాంగ్రెస్ వైపు.. కరీంనగర్ ప్రజల చూపు..**

ఇప్పటికే నగరంలో రాజకీయం రోజు రోజుకు మారుతోంది. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన అనే నినాదాలతో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్తోంది. కరీంనగర్ ప్రజల చూపు స్పష్టంగా కాంగ్రెస్ వైపే మళ్లుతోంది. మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునే దిశగా పార్టీ వేగంగా ముందుకు దూసుకుపోతోంది. రెండేళ్లలో కరీంనగర్ ను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసిందని వెలిచాల వివరిస్తున్నారు. ఏ పని అయినా కాంగ్రెస్‌తో అవుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**బెంబేలెత్తుతున్న బీఆర్ఎస్.. బీజేపీ**

కాంగ్రెస్ దూకుడుతో బీఆర్ఎస్, బీజేపీ నేతల్లో గుబులు మొదలైంది. భారీ స్థాయిలో పార్టీలో చేరికలు.. సభలు.. సమావేశాలతో కాంగ్రెస్ బలం పెరుగుతుండటంతో ప్రత్యర్థి పార్టీలకు నిద్ర కరువైంది. ఒకప్పుడు ధైర్యంగా కనిపించిన వారు ఇప్పుడు రక్షణలో పడుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్.. బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని కాంగ్రెస్ నేతలు బాహటంగానే చెబుతున్నారు. ఆ రెండు పార్టీలకు ఓటు వేస్తే మురిగిపోతుందని ప్రజలకు నొక్కి చెబుతున్నారు వెలిచాల.. ప్రజలను ఆలోచనలో పడేస్తున్నారు.

**సీఎం రేవంత్ అన్న సైనికుడు – వెలిచాల వెల్‌డన్**

సీఎం రేవంత్ రెడ్డి ఆశయాలను కరీంనగర్ గడ్డపై అమలు చేస్తూ, పార్టీని విజయపథంలో నడిపిస్తున్న వెలిచాల రాజేందర్ రావు నిజంగా కాంగ్రెస్‌కు బలమైన స్తంభంగా మారారు. నాయకత్వం, వ్యూహం, కష్టపడే తత్వం – మూడు కలిసి కరీంనగర్‌లో కాంగ్రెస్ పునర్ వైభవానికి బాటలు పడుతున్నాయి.

**బీఆర్ఎస్ అవినీతిపై ఫోకస్..**

గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ సాగించిన ఆరాచకం.. దౌర్జన్యం.. భూకబ్జాలపై వెలిచాల ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. బీఆర్ఎస్ అవినీతి వ్యవహారాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. స్మార్ట్ సిటీ పేరిట వందల కోట్లు వృథా చేశారని చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడే కరీంనగర్ ను పట్టించుకోలే మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు వేస్తే మళ్లీ ప్రజలను పీక్కుతీంటారని ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్‌తోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమవుతుందని బలంగా నొక్కి చెబుతున్నారు.

**బీజేపీకి గల్లీలతో సంబంధమే లేదు..**

ఢిల్లీలో ఉండే బీజేపీకి గల్లీలతో సంబంధమే లేదు.. గల్లీ సమస్యలు పరిష్కరించేంది కేవలం కాంగ్రెస్ అని వెలిచాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వారి ఓటు వేస్తే మురిగిపోతుందని చెబుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా వారు గల్లీల్లో చేసేది ఏమి లేదని బాహటంగానే వివరిస్తున్నారు. గల్లీల్లో ఏ పని అయినా కాంగ్రెస్ ప్రభుత్వమే చేస్తుందని స్పష్టం చేస్తున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీని కార్పొరేషన్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో ప్రజలు ఆలోచనలో పడి కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.



## తండ్రి చేసిన అభివృద్ధి వివరిస్తూ..

రాజేందర్ రావు తన తండ్రి జగపతిరావు కరీంనగర్ ఎమ్మెల్యేగా పని చేసిన కాలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేస్తున్నారు. తండ్రి ఆజ్ఞ మేరకు ఇక్కడి ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చానని, కరీంనగర్ ప్రజలే తన కుటుంబసభ్యులనీ, వారికి ఏ ఆపద వచ్చినా అర్ధరాత్రి అపరాత్రి వెన్నంటే ఉంటానని స్పష్టం చేస్తున్నారు. తన తండ్రి ఆశయ సాధనకు కంకణబద్ధుడినై ప్రజలతో కలిసి మమేకమై పోతున్నానని చెబుతున్నారు. కరీంనగర్‌లో గల్లీ గల్లీన తన తండ్రి జగపతిరావు చేసిన అభివృద్ధి పనులే దర్శమిస్తున్నాయనీ, ఇప్పటికీ ఆ పనులు చెక్కు చెదరలేదని రాజేందర్‌రావు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ మేయర్ పీఠం దక్కించుకోవడమే తన ముందుకు ఉన్న ప్రధాన లక్ష్యమని ఆయన చెబుతున్నారు. మొత్తానికి..కరీంనగర్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. కాంగ్రెస్ ఉత్సాహం ఉరకలేస్తోంది. ప్రజల మద్దతు పెరుగుతోంది. మేయర్ పీఠమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. కరీంనగర్‌లో ఇక కాంగ్రెస్ హవా మొదలైందనే చెప్పాలి









## సమ్మక్క- సారక్క తల్లులను దర్శించుకున్న చల్లా దంపతులు

**మహా పరకాల:** ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ సమ్మక్కసారలమ్మ మహా జాతర సందర్భంగా శ్రీ సమ్మక్కసారలమ్మ తల్లులను కుటుంబసమేతంగా వెళ్ళి దర్శించుకొన్న పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టశ్వర్యాలతో,ఉండాలని దీవించండి అని అమ్మవార్లను మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సమ్మక్క సారక్క తల్లులను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు పగడాల కాళీ ప్రసాద్ రావు


**మహా పరకాల:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన అడవి తల్లి ఒడిలో, జంపన్న వాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో అష్టఐశ్వర్యలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని తల్లులను కోరుకోవడం జరిగింది బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే పగడాల కాళీ ప్రసాద్ రావు తెలిపారు. అడవిబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపాలైన సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకోవడం గర్వకారణమని ఈ సందర్భంగా డా.కాళీ ప్రసాద్ రావు తెలిపారు. మేడారం జాతర గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు మేడారం జాతరకు మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్ దామెర ఉప్పుల చంద్ర మౌళి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. జిల్లా ప్రజలు, పిర్యాదు దారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## మహిళ అదృశ్యం.. కేసు నమోదు



**మొయినాబాద్ మహా:** మహిళ అదృశ్యమైన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుండే మహేందర్ అతని భార్య కుండే ప్రవలిక (28) స్థానిక భాస్కర్ ఆసుపత్రిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. అతని భార్య కుండే ప్రవలిక రోజులాగే శుక్రవారం ఉదయం భాస్కర్ ఆసుపత్రికి ఉద్యోగానికి వెళ్ళింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుండే మహేందర్ తన భార్యకు ఫోన్ చేయగా.. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో వెంటనే తన భార్య కోసం భాస్కర్ ఆసుపత్రికి వెళ్లి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకోగా.. ఉదయం 11 గంటలకు తన భర్తకు యాక్సిడెంట్ అయ్యిందని, ఆసుపత్రిలో చెప్పి వెళ్లినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారని, పోలీసులకు తెలిపాడు. తన భార్య కోసం అన్ని ప్రదేశాల్లో ఎంత వెతికిన ఆచూకీ లభించకపోవడంతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# మేడారం ట్రాఫిక్ లో ప్రయాణికుల నరకయాతన

**వరంగల్ టు మేడారం 13 గంటలు.. అర్ధరాత్రి అరణ్యంలో ప్రయాణికుల తిప్పలు**

**ట్రాఫిక్ కంట్రోల్ చేయడంలో పోలీస్ యంత్రాంగం విఫలం**



**వరంగల్ మహా;** గతంలో ఎన్నడూ లేనివిధంగా మేడారం జాతర కు తీవ్రంగా ట్రాఫిక్ సెగ పట్టుకుంది. మేడారానికి వెళ్లే ప్రయాణికులు అరణ్యం లోనే దాదాపు 9 గంటల పాటు వాహనాల లోనే పిల్లా పాపలతో నరకయాతన అనుభవించారు. దీంతో ఇటు ప్రభుత్వం పై అటు పోలీస్ యంత్రాంగం పై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. మేడారం మహా జాతర సందర్భంగా ట్రాఫిక్ కంట్రోల్ చేయడంలో పోలీస్ యంత్రాంగం ఘోరంగా విఫలం అయ్యింది. వరంగల్ హన్మకొండ నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులలో మేడారానికి చేరుకోవడానికి దాదాపు 12 నుంచి 13 గంటల సమయం పట్టింది. సాధారణంగా కొన్ని గంటల్లో పూర్తయ్యే ఈ ప్రయాణం ఈసారి నరక ప్రాయంగా మారింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఈ ట్రాఫిక్ జామ్ కొనసాగిందని ప్రయాణికులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో శుక్రవారం సాయంత్రం బయలుదేరిన భక్తులు శనివారం ఉదయం దాదాపు 10.30 గంటలకు మేడారం చేరుకునే దుస్థితి నెలకొంది. అర్ధరాత్రి దట్టమైన అడవుల్లో, విపరీతమైన చలిలో పిల్లా పాపలు, మహిళలతో కలిసి భక్తులు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్న ప్రభుత్వం అలాగే క్రౌడ్ కంట్రోల్ కోసం ఆధునిక టెక్నాలజీ, డ్రోన్స్ పెంచామని గొప్పలు చెప్పిన పోలీస్ శాఖ, ట్రాఫిక్ నియంత్రణలో మాత్రం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ట్రాఫిక్ నియంత్రించడంలో సరైన ప్రణాళిక లేకపోవడం, వాహనాల నియంత్రణలో అలసత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా శుక్రవారం సాయంత్రం వరంగల్, హనుమకొండ తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి బయ లుదేరిన భక్తులు శనివారం ఉదయం వరకు మేడారం చేరుకోకపోవడంతో ప్రయాణికులు తిండి తిప్పలు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా జాతర చివరి రోజు ఖాళీగా కనిపించే గద్దెల ప్రాంతం ఈసారి భక్తులతో కిక్కిరిసిపోయింది.

### అరణ్యంలో కదలని వాహనాలు

మేడారం వచ్చే రహదారులు అన్ని ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ వాహనాల తో ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన బస్టాండ్ లో ఒక్క బస్సు కదలక పోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మేడారం నుంచి పస్రా నుంచి తాడ్వాయి, తాడ్వాయి నుంచి మేడారం సుమారు 34 కిలో మీటర్ల మేర ఒకవైపు వాహనాలు నిలిచిపోవడం తో ప్రైవేట్ వాహనదారులు మరో లైన్ కట్టడంతో ఈ ఇబ్బంది ఏర్పడింది. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు ఎక్కువ మొత్తంలో ఆశ్రయించడంతో శనివారం కూడా వనదేవతల దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వచ్చారు. క్రౌడ్ కంట్రోల్ నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలం కావడంతో భక్తులు ఆగ్రహంతో ఊగిపోయారు. చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ నుంచి బస్సులు కదలక పోవడంతో రాత్రి భక్తులు ఆందోళనకు దిగినట్లు తెలిసింది. వీఐపీ, వీవీఐపీ వాహనాలు ఆర్టీసీ బస్సుల మధ్యలోకి రావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది.

# మేడారం జాతరలో ఐఎంఎ వారి వైద్య సేవలు

డాక్టర్ బందెల మోహన్ రావు



**వరంగల్ మహా;** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మేడారం జాతరలో వేలాది మంది భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ బందెల మోహన్ రావు ఐఎంఎ జాతీయ హాస్పిటల్ బోర్డు కమిటీ సభ్యులు (హెచ్ క్యూ ఎస్) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే అతిపెద్ద మేడారం గిరిజన మహా జాతర లో కోటిన్నరకు పైగా భక్తులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఐఎంఎ వారు గత కొన్ని సంవత్సరాలుగా సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద భక్తులకు వైద్య సమస్యల్లో వారికి ఎటువంటి ఇబ్బందులు కలవకుండా ఏర్పాటు చేసిన 50 పడకల ఆసుపత్రి లో వరంగల్ డిఎంహెచ్వో నేతృత్వంలో ప్రతి రోజూ ఐఎంఎ నుండి 15 మంది వైద్య నిపుణులు అన్ని విధాలా వైద్య సేవలు అందిస్తున్నారని అంతేకాకుండా ట్రీట్మెంట్ తో పాటు ఔషధాలను కూడా అందిస్తున్నామని డాక్టర్ బందెల మోహన్ రావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలోడాక్టర్ శిరీష్ (ఆర్థోపెడిక్), డాక్టర్ రాజ్ కుమార్ (నేత్ర వైద్యులు) డాక్టర్ పరమేశ్వర్ (నేత్ర వైద్యులు), డాక్టర్ రణధీర్, తో పాటు డాక్టర్ గోపాల్ రావు, ములుగు డీఎంహెచ్ఓ, వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబ శివ రావు, సిబ్బంది పాల్గొంటున్నారు.

# పోగొట్టుకున్న రూ.16 లక్షల విలువైన బంగారాన్ని బాధితులకు అందజేత

వేలేరు ఎస్సై సురేష్ కుమార్



**హన్మకొండ మహా;** అనుకోని పరిస్థితుల్లో బంగారం పోగొట్టుకున్న బాధితులకు వేలేరు పోలీసులు నిస్వార్థంగా న్యాయం చేశారు. పోగొట్టుకున్న సుమారు 16 లక్షల రూపాయలు విలువగల 100 గ్రాముల బంగారు ఆభరణాలను తిరిగి బాధితులకు అందజేసారు. వేలేరు మండలం కేంద్రానికి చెందిన గంజి రమేష్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం లింగంపల్లి సమ్మక్క సారలమ్మ జాతర కారులో బయలుదేరే క్రమంలో, మినరల్ వాటర్ ను ట్యాంక్ లో నింపుకునేందుకు, వాటర్ ట్యాంక్ ను తీసే క్రమంలో కారు డిక్కీలో ఉన్న బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగు కిందపడిపోవడం జరిగింది. ఇది గమనించకుండా కారులో జాతరకు వెళ్లిపోయిన బాధితుడు, తిరుగు ప్రయాణంలో తన కారు డిక్కీలో బ్యాగు కనిపించకపోయేసరికి, కంగారుపడి బాధితుడు ఇంటిలో కూడా వెతకగా ఇంటిలో కనిపించకపోయేసరికి, ఎక్కడో రోడ్డు మార్గమధ్యలో పడి పోయినట్లుగా అనుమానించాడు బాధితుడు. శనివారం ఉదయం వేలేరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, అప్రమత్తమైన పోలీసులు ఎస్సై సురేష్ కుమార్ ఆధ్వర్యంలో, స్థానిక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి సదరు రోడ్డుపై పడిపోయిన బంగారు ఆభరణాల బ్యాగును అక్కడే ఉన్న ఓ వ్యాపారి తీసుకున్నట్లుగా గుర్తించిన పోలీసులు, అతని నుండి బంగారు ఆభరణాల బ్యాగ్ పోలీసులు స్వాధీనం చేసుకొని బాధిత దంపతులకు ఎస్.ఐ చేతుల మీదుగా బ్యాగ్ ను అందజేయడం జరిగింది. బాధితుడి ఫిర్యాదు పై తక్షణమే స్పందించి పోయిన బ్యాగ్ ను తిరిగి అందజేసిన వేలేరు పోలీసులకు భాదితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ తో పాటు ఏఎస్ ఐ, కానిస్టేబుల్ వీరు, ఉన్నారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించండి

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**షాద్ నగర్. మహా:** ఎన్నికల ప్రక్రియను సజావుగా జరపాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల అధికారి, సిబ్బందిలను ఆదేశించారు. ఫిబ్రవరి 11న జరగబోతున్న షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటను, అదేవిధంగా ఎన్నికల ప్రక్రియను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎన్నికల పర్యవేక్షకుడు మయాంక్ మిట్టల్ పర్యవేక్షించారు. శనివారం స్థానిక మున్సిపాలిటీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరుగుతున్న స్క్రూటిని ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాటు తదితర ప్రక్రియ గురించి అసిస్టెంట్ డిస్టిక్ ఎలక్షన్ ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫర్నిచర్ అదేవిధంగా స్టేషనరీ తదితర అంశాలను తెలుసుకొని వాటిని పరిశీలించారు. నామినేషన్లకు సంబంధించి స్క్రూటిని ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అశ్రద్ధ చేయకూడదని సజావుగా జరిగే విధంగా అధికారులు సిబ్బంది అందరూ కృషి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను ప్రక్రియను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎన్నికల అనంతరం ఈనెల 13న జరగబోయే కౌంటింగ్ తదితర ఫలితాల ఏర్పాట్లు ఇండోర్ స్టేడియంలో చేసినట్లు స్థానిక అధికారి సునీతా రెడ్డి తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక ఆర్డిఓ సరిత, స్థానిక ఎంఆర్ఓ నాగయ్య తదితరులు ఉన్నారు.



## సీసీ కెమెరాలు శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడతాయి

సీఐ జీ.పవన్ కుమార్ రెడ్డి

**మొయినాబాద్ మహా:** సీసీ కెమెరాలు శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో దోహదపడుతాయని, మొయినాబాద్ సీఐ జీ.పవన్ కుమార్ రెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో కె.కిషోర్ కుమార్ సహకారంతో 21 సీసీ కెమెరాలను ఏర్పాటు చెయగా.. మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. అనంతరం సీఐ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల దోపిడి నివారణ గ్రామాల్లో శాంతి భద్రత పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని, అన్నారు. ఎన్కేపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం కృషిచేసిన గ్రామ (విపిఓ) హెడ్ కానిస్టేబుల్ టీ.రామచందర్ గౌడ్ ను సీఐ పవన్ కుమార్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, గ్రామపెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి



**ఆమనగల్లు, మహా:** ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేయాలని, పనుల ఎంపికలో పంచాయతీల హక్కులను పునరుద్ధరించాలని కోరుతూ కడ్తాల్ మండలం చరికొండ గ్రామసభ శనివారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మాన పత్రాన్ని సర్పంచ్ మహేందర్ గౌడ్.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సంధ్యారెడ్డి, పలువురు నాయకులు పాల్గొని పంచాయతీల రాజ్యాంగ హక్కులకు తమ మద్దతు ప్రకటించారు.

# మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి




- బుక్ ఎ కాల్ పై విస్తృత ప్రచారం చేయండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి ఐఏఎస్

**వరంగల్ మహా;** హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై శనివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ వరంగల్ కలెక్టరేట్ నుండి వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, తో పాటు ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రివిజన్ శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.


**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్**

మ్యాపింగ్ లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుండి ఖచ్చితమైన వివరాలు సేకరించాలని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను నిర్ధారించి, శాతం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు**

తమ బూత్ లెవల్ ఏజెంట్లు ను వెంటనే నియమించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు, తప్పు లింకింగ్‌లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల సౌలభ్యం కొరకు "బుక్ ఎ కాల్" సదుపాయం పై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకమని, అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చేయాలని అన్నారు. ఈ వీసి లో ఆర్డీవో లు తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.





# జనం నుంచి వనంకు వన దేవతలు

**ముగిసిన మేడారం మహా జాతర ప్రస్థానం .. వన ప్రవేశం చేసిన సమ్మక్క, సారలమ్మ**

**వరంగల్ మహా;** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర ప్రస్థానం శనివారం తో ముగిసింది. అయినప్పటికీ భక్తుల తాకిడి ఏమాత్రం తగ్గలేదు. నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర శనివారం తల్లుల వనప్రవేశం తో మహా జాతర ముగిసింది. శనివారం సాయంత్రం గద్దెల ను పరిశుభ్రం చేసి, గిరిజన గంటల సమయంలో వన దేవతల వన ప్రవేశం పూజారులు అమ్మవార్లకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. రాత్రి 7 ప్రారంభమయింది. సమ్మక్క తల్లిని చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లి ఆలయానికి, పగిడిద్ద రాజును మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లకు, గోవిందరాజు లను ఏటూరు నాగారం మండలం కొండాయ్ గ్రామానికి పూజారులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. దేవతల వనప్రవేశంతో మేడారం మహా జాతర ముగిసింది.

**తగ్గని భక్తుల తాకిడి**

వనదేవతలు వనప్రవేశం చేసినప్పటికీ మేడారం ఇంకా భక్తులతో కిటికిటలాడుతోంది. మహా జాతర ముగుస్తున్న తరుణంలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించుకుంటున్నారు. సమ్మక్క సారలమ్మలకు చీర, సారె, ఒడిబియ్యం పోసి దేవతలను మనసారా కొలుచుకుంటున్నారు. తోపులాటలు, క్యూలైన్లలోనే గంటల సేపు పడిగాపులు పడినా లెక్క చేయకుండా అమ్మవార్ల దర్శనాలు చేసుకున్నారు. క్యూలైన్ల వద్ద మరింత పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని భక్తుల అభిప్రాయపడ్డారు. మేడారంలో దర్శనాలు మాత్రం నిరాటంకంగా జరుగుతూనే ఉన్నాయి. సమ్మక్క సారలమ్మ వనప్రవేశం అనంతరం కూడా భక్తులు భారీగా తరలివచ్చి సమ్మక్క సారలమ్మ లకు మొక్కులు చెల్లించు కుంటున్నారు.

# పరీక్షల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

- పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు సదుపాయాలు తప్పనిసరి
- బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య




**వరంగల్ మహా;** ఫిబ్రవరి 2 వ తేదీ నుండి నిర్వహించబోయే ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, 25 నుండి జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలను బోర్డు నియమ నిబంధనల మేరకు విద్యార్థులకు ఎటువంటి లోటు పాట్లు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్నారు. శుక్రవారం హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వరంగల్, హన్మకొండ జిల్లాల పరీక్ష నిర్వాహకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల పర్యవేక్షణ, ల్యాబ్ పరికరాలు, ఫర్నీచర్, గాలి, విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతి, పరీక్షల వేళల్లో తగు రవాణా ఏర్పాట్లకై అన్ని డిపార్ట్ మెంట్ల సహకారం తీసుకోవాలని అన్నారు. వరంగల్, హన్మకొండ డీఐఈఓ లు వాహనాల రాక పోకలు, ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల స్టోరేజ్, కార్యాలయ విధులు తదితర అంశాల పై పూర్తి వివరాలు తెలియజేశారు.ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా నిర్వహించ బడుతాయి. పరీక్షల పర్యవేక్షణకు గాను జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, ఛీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏమైన సందేహాలుంటే టోల్ ఫ్రీ నెం. 9240205555 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఇంటర్ విద్యాధికారులు శ్రీ గోపాల్, డాక్టర్ శ్రీధర్ సుమన్, డీఈసీ సభ్యులు, సీనియర్ ప్రిన్సిపాళ్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం

**వరంగల్, మహా;** జిల్లాలో నిర్వహిస్తున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల పై నోడల్ అధికారులు పూర్తి అవగాహనతో, అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కిల్లు శివకుమార్ నాయుడు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వీరా రెడ్డిలతో కలిసి జిల్లా నోడల్ అధికారులతో కిల్లు శివకుమార్ నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ, జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా సమష్టిగా, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం సూచనల మేరకు సమయానికి పూర్తి చేయాలని, అన్ని అంశాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, శిక్షణ, లాజిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నోడల్ అధికారులు తమ విధుల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణతో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించాలని అన్నారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన విధులను అత్యంత బాధ్యతతో, తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అందరూ అంకితభావంతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు భాస్కర్, సుధీర్ కుమార్, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



# ఆమనగల్లు పుర పోరు

- జనరల్ స్థానాల్లో బలమైన నాయకులకే టికెట్లు
- ఓటర్లకు అంతు చిక్కని రాజకీయం
- మున్సిపల్ ఎన్నికల్లో భారీగా ఆశావహులు
- ఒక్కో వార్డు నుంచి ఇద్దరు, ముగ్గురు పోటీ
- పార్టీ అభ్యర్థుల ఖరారులో నాయకత్వానికి తలనొప్పి




**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ లో రెండోసారి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటీ పీఠం ఎవరిని వరిస్తుందోనన్న చర్చ వేడి వేడిగా జరుగుతున్నది.గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించు కోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా తలపడ్డాయి. మున్సిపాలిటీలో 15 వార్డులు ఉండగా చైర్మన్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోగా ఛైర్పర్సన్ గా రాంపాల్ పదవి చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ పదవిని అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)గా ప్రకటించడంతో పట్టణ రాజకీయాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి.ఈ నిర్ణయంతో అన్ని సామాజిక వర్గాలకు చెందిన నేతలు పోటీ బరిలోకి దిగే అవకాశం లభించడంతో రాజకీయ పోరు మరింత తీవ్రంగా మారింది.ఇప్పటివరకు మౌనంగా ఉన్న ఆశావహులు ఒక్కసారిగా చురుగ్గా మారి,తమ బలాబలాలను పరీక్షించుకోనున్నారు. బలమైన నాయకులకే టికెట్లు ఆయా ప్రధాన పార్టీలు బీ ఫామ్ లు ఇచ్చారు. పార్టీ టికెట్లు దక్కవనుకున్న ఆశావహులు ఇప్పటికే కండువాలు మార్చేశారు. కొంతమంది నాయకులు ప్రచారాలు సైతం మొదలు పెట్టారు. వార్డుల్లో తిరిగి ప్రజలను కలిసి తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పార్టీ టికెట్లు రావని భావించిన నాయకులు కొందరు ఇప్పటికే కండువాలు మార్చారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరితే.. మరికొన్ని చోట్ల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో, బీజేపీలో చేరారు. జంపింగ్‌లు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.ఎంతైనా ఖర్చు పెడతామంటూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఖర్చుకు ఏమాత్రం వెనుకడుగు వేయమంటూ ప్రధాన పార్టీల నుంచి పోటీచేసి చైర్మన్ అయ్యేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు తెలుస్తోంది.కౌన్సిలర్ పదవి గెలవాల్సిందేనని ఉద్దేశంతో పాలకపక్షం, ప్రతిపక్షం రెండు పార్టీలు ప్రజాబలం చూయించుకోవడం కోసం, ఎన్నికల్లో విజయ తీరాలకు చేరుకోవడం లక్ష్యంగా ఇతర పార్టీల్లో కార్యకర్తలను, నాయకులను తమ వైపు లాక్కోవడానికి అనేక ఎత్తులు, పై ఎత్తులు వేస్తూ కండువాల మార్పిడి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కండువాల మార్పిడి కొంత ఉధృతంగానే సాగుతున్నట్లుకనిపిస్తుంది. అంతేకాకుండా గత ఎన్నికలకు, ఇప్పుడున్న నాయకులు, కార్యకర్తలకు,ఏళ్ల తరబడి జెండాలు మోసిన కార్యకర్తలకు మధ్య కూడా బేధాభిప్రాయాలు ఏర్పడి ఇప్పుడు కండువాలు మారడం, లేదా ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోటీ చేస్తుండడం కనిపిస్తోంది.

**ఇంటింటికీ తిరుగుతూ..**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన నాయకులంతా వార్డుల్లో ప్రచారాలు మొదలు పెట్టారు. ఇంటింటికి తిరిగి తాము ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని.. తమను గెలిపించాలని ఓటర్లకు చెబుతూ అభ్యర్థిస్తున్నారు. ఓటర్లను ఆకర్శించేందుకు నాయకులంతా ప్రచారం చేస్తున్నారు.అయితే ప్రధాన పార్టీల టికెట్ల విషయంలో గట్టి పోటీ నెలకొంది.

**ఓట్ల వేట ప్రారంభం...**

లోతుల్లోకి వెళ్తే తప్ప గెలుచుకోవడం కష్టం. గ్రామాల్లో బంధువులు,సంబంధీకులు,కులాలు, మతాలు, మన బజారు, మన వార్డు లాంటి ఫీలింగ్ ఓటర్లలో అధికంగా ఉంటుంది. అందుకోసం కౌన్సిలర్ అభ్యర్థులు ఉన్న ఓట్లను తమ సామాజిక వర్గం, పార్టీ, వార్డు, శ్రేయోభిలాషులు, ఇతర పార్టీలలో ఉన్న అసమ్మతి కార్యకర్తల పేరుతో ఓట్లను ఎక్కడికక్కడ వేర్వేరు జాబితాలు తయారు చేస్తున్నారు. ఆ జాబితాలో ఉన్న ఓటర్లను మెప్పించుకోవడానికి ఎలాంటి ప్రయోగాలు చేయాలో వాటిని రచించే పనిలో అభ్యర్థులు ఉన్నారు. ఇదిలా ఉంటే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను రప్పించడం కోసం ప్రత్యేక ఏజెంట్లను ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు.





## సమతాకుంభ్2026 నాల్గవ బ్రహ్మోత్సవాల వేడుకలో
# రామచంద్రప్రభువుకు శేషవాహన సేవలు..

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామంలోని శ్రీరాంనగర్ లో శ్రీ చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో సమతాకుంభ్2026 నాల్గవ బ్రహ్మోత్సవాల వేడుకలు జరుగుతున్నాయి.శ్రీరామానుజాచార్య108 దివ్యదేశాల 4వ బ్రహ్మోత్సవాలుసమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.శనివారం హోమశాలలో 9 అగ్నికుండాల్లో అగ్నిప్రతిష్ఠ ఉదయం ధ్వజారోహణం, సూర్యప్రభవాహన సేవలు, గరుడ ప్రసాదం వితరణ, సామూహిక శ్రీరామ అష్టోత్తర శతనామార్చన, సాయంత్రం సాకేత రామచంద్రప్రభువుకు శేషవాహన సేవలు అంగరంగ వైభవంగా జరిగాయి.1000 రూపాల్లో శ్రీ గోదాదేవి దర్శనమిచ్చారు. రాత్రి 18 దివ్యదేశ మూర్తులకు గరుడసేవలు నిర్వహించారు. సమతాకుంభ్2026 నాల్గవ బ్రహ్మోత్సవాల వేడుకలు ఫిబ్రవరి 9 వరకు జరుగుతాయి.



### ఎమ్మార్వో ఆర్డీవోలకు రేడియల్ రింగ్ రోడ్
## భూ బాధితుల వినతులు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని కొత్వాల్ గూడ గ్రామస్తులు, రైతులు శనివారం ఆర్డీఓ వెంకట్ రెడ్డి, ఎమ్మార్వో రవీందర్ దత్ కు రేడియల్ రింగ్ రోడ్ భూ బాధితులు రోడ్డు వల్ల శంషాబాద్ నగరానికి, మండలానికి రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు అన్ని వినతిపత్రం అందజేశారు. 81 2026 నాడు రేడియల్ రింగ్ రోడ్ ప్రకటన వెలువడింది. రోడ్డు విస్తరణలో భూమి కోల్పోతున్న రైతులు మీ అభ్యంతరాలు ఉంటే ప్రకటన వెలువడిన తేదీ నుంచి 60 రోజుల వ్యవధిలో లోపు ఎమ్మార్వో గాని, జిల్లా కలెక్టర్ల గాని అభ్యంతరాలు తెలుపగలరని ప్రకటన చేశారు. ప్రభుత్వము మా రైతులకు ఆ సమయం ఇవ్వకుండా ప్రకటన వెలువడిన రోజు నుండి రేడియల్ రింగ్ రోడ్ సర్వేకు రెవెన్యూ అధికారులు రావడం జరిగింది. 60 రోజుల సమయం మా రైతులకు ఇవ్వాలన్నారు. 60 రోజుల సమయం పూర్తయిన తర్వాతనే సర్వేకు రావాలి. అంతలోపు ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి రేడియల్ రోడ్ వల్ల గ్రామ ప్రజలకు రైతులకు ఎలాంటి మేలు జరుగుతుందో వివరించాలని కొత్వాల్ గూడ గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేశారు.

# ప్లాస్టిక్ ను నిషేధించండి క్లాత్ బ్యాక్స్ ను మాత్రమే వాడండి

### డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య



**రాజేంద్రనగర్, మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని వారంతపు మార్కెట్లలో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆదేశాలతో డీపీఓ స్వాతి ఆధ్వర్యంలో ఆర్పీలు జిహెచ్ఎంసి సిబ్బంది కలిసి మార్కెట్లలో విస్తృత అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వ్యాపారులు, వినియోగదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ, క్లాత్ బ్యాగ్స్ మాత్రమే వినియోగించాలని సూచించారు.వారంతపు మార్కెట్లలో ప్లాస్టిక్ సంచుల వినియోగం కొంతవరకు నియంత్రణలోకి వచ్చాయన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం జరిమానాలువిధించబడతాయని హెచ్చరించారు.అలాగే, మార్కెట్ ముగిసిన అనంతరం వ్యాపారులు తమ తమ దుకాణాల పరిసరాలను రహదారులను తప్పనిసరిగా శుభ్రంగా ఉంచుకోవాలి, చెత్త సేకరణ కేంద్రాల్లో మాత్రమే చెత్తను వేయాలని స్పష్టం చేశారు.అత్తాపూర్ సర్కిల్‌ను పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ప్రజలు, వ్యాపారులు, అధికారులు అందరూ సహకరించాలని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య కోరారు.



## వైభవంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ వేడుకను నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ బిక్షపతి, ఉప సర్పంచ్ యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**ఆమనగల్లు, మహా:** పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన సంఘటన ఆమనగల్లులోని అరబిందో ఉన్నత పాఠశాలలో జరిగింది. శనివారము అరబిందో ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 90 మంది విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం లో పాల్గొని, తమ తోటి విద్యార్థులకు పాఠలను బోధించారు. కలెక్టర్లుగా చరణ్, అపూర్వ, అక్సర్,కృష్ణ శశాంక్, డీఈవోగా పూజిత, ప్రిన్సిపాల్ గా మహీన్, వైస్ ప్రిన్సిపాల్ గా సాత్విక, చైర్మన్ గా భవాని ప్రసాద్,ఎంఈఓ గా అక్షిత వ్యవహరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమం లో కరెస్పాండంట్ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల దశ నుండే విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, తమ గమ్యస్థానాల వైపు పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం భాస్కర్, నరేష్, నజీర్, శ్రీను, రతీష్, అజిత్, సునీత, రాధ, సౌమ్య,సౌజన్య,యామిని,రఘు,శైలజ, సింధు, భార్గవి, తదితరులు పాల్గొన్నారురిషి టాలెంట్ పాఠశాలలో పాఠాలు నేర్చుకునే విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి ఉపాధ్యాయులతో శభాష్ అనిపించుకున్నారు అమనగల్లు పట్టణంలోని రిషి టాలెంట్ పాఠశాల విద్యార్థులు...శనివారం ఆ పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తొటి విద్యార్థులకు పాఠాలు బోధించడంతో మరిచిపోలేని అనుభూతిని పొందామని తెలిపారు, ఉపాధ్యాయులుగా విద్యార్థులు బాధ్యతలు చేపట్టి అంతులేని ఆనందాన్ని పొందమాని చెప్పారు.విద్యార్థులు అలరించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్, స్కూల్ అడ్వైజర్లు సత్యరాములు, రమేష్, కరస్పాండెంట్ అవ్వారి నిరంజన్, ప్రిన్సిపల్ పూర్ణ చంద్ర, వైస్ ప్రిన్సిపల్ లలిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### చేపల వేటకు వెళ్లి చెరువులో పడి
## వృద్ధురాలు మృతి



**అమనగల్లు, మహా:** తలకొండపల్లి మండలం లోని వెల్జాల్ గ్రామానికి చెందిన వద్దే బాలమ్మ (60) సహదేవ్ సముద్రం చెరువులో పడిమృతి చెందింది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. బాలమ్మ శుక్రవారం సాయంత్రం చేపల వేటకని ఇంటి నుంచి బయలుదేరి ప్రమాదవశాత్తు చెరువులోపడిపోయింది. శనివారం ఉదయం చెరువులో ఆమె మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్వతంత్ర అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకోవాలని ఒత్తిడి

- ఓటమి భయంతోనే అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల బేరా సారాలు
- వార్డుల్లో ప్రభావం చూపనున్న స్వతంత్ర అభ్యర్థులు

**క్యాతన్ పల్లి, మహా :** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికలవేళ స్వతంత్ర అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకోవాలని పాలక, ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్ అభ్యర్థుల పోటీదారులను ఒత్తిడికి గురి చేస్తున్నారని పేరు చెప్పడానికి నిరాకరిస్తున్న అభ్యర్థులు వాపోతున్నారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో 22 వార్డులు ఉన్నాయి. కొన్ని వార్డులలో ప్రభావం చూపనున్న స్వతంత్ర అభ్యర్థులను పోటీ నుంచి తప్పుకోవాలంటూ ప్రధాన పార్టీల నేతలు ఒత్తిడి పెంచుతున్నారని తెలుస్తోంది. పట్టణంలో కీలకమైన నేతలుగా పేరున్న నేతలు తాము పోటీ చేసే వార్డుల్లో ఎక్కడ ఓటమిపాలవుతామోననే బెంగతో స్వతంత్రులను వివిధ రకాలుగా ప్రసన్నం చేసుకుంటున్నారని సమాచారం. పలు వార్డులలో పరిచయాలు పట్టు కున్న అభ్యర్థులు ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకు తమకున్న అంగ బలం, ఆర్థిక బలాలతో ఫలానా అభ్యర్థి పోటీ నుంచి తప్పుకొని.తమకే మద్దతు ఇస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు కొంతమంది పోటీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొంతమంది పాలక, ప్రతిపక్ష పార్టీ నేతలు పోటీదారులకు ఎవరెవరు సన్నిహితులుగా ఉంటారు అనే సమాచారం సేకరించి వారితో పోటీ నుండి విరమించుకునేందుకు బుజ్జగింపులు నేరిపేందుకు సామ, దాన,భేద, దండోపాయాలను ఉపయోగిస్తున్నట్లు పట్టణంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. వీరి చర్యల వల్ల కౌన్సిలర్ పోటీదారులు తమకు స్వేచ్ఛగా పోటీ చేసే స్వతంత్రం లేకుండా పోతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు.



### శంషాబాద్ విమానాశ్రయంలో 9.5 కోట్లు విలువచేసే 27.15 కిలోల హైడ్రోపోనిక్
## గంజాయి స్వాధీనం

### ఏడుగురు ప్రయాణికులు అరెస్ట్

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం భారీగా మత్తుపదార్థాలు పట్టుబడ్డాయి.డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ( డి ఆర్ ఐ ) అధికారులు బ్యాంకాక్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న ఏడుగురు ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు చేయగా ట్రాలీ బ్యాగ్‌లలో తరలిస్తున్న సుమారు రూ.9.5 కోట్ల విలువైన, 27.15 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో మొత్తం ఏడుగురు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. విమానాశ్రయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసిన ఎయిర్పోర్ట్ అధికారులు.అంతర్జాతీయ మత్తుపదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని డిఆర్ఐ అధికారులు తెలిపారు.

# షాద్ నగర్ లో ముమ్మరంగా వాహనాల తనిఖీ



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ శివర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాస్, అదేవిధంగా ఫరూక్ నగర్ రెవెన్యూ సిబ్బంది కార్తీక్ అలాగే పలువురు పోలీసు సిబ్బంది కలిసి వాహనాలను ఇక్కడ ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. వాహనాల తనిఖీల సమయంలో వీడియో రికార్డు చేయిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపు చట్టరీత్యా నేరమని 50వేల రూపాయల నగదు కన్నా ఎక్కువ రవాణా చేస్తే అది చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. శనివారం షాద్ నగర్ పట్టణ శివారులోని మిలీనియం టౌన్షిప్ సమీపంలో నగదు తనిఖీల ప్రత్యేక బృందాలు పలు వాహనాలను తనిఖీ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఈ బృందాల పాత్ర కీలకంగా ఉంటుందన్న విషయం అందరికీ విదితమే. ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, లిక్కర్ తదితర వస్తువులు పట్టుబడ్డ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ వీడియో రికార్డ్ తప్పనిసరిగా ఉంటుంది. సామాగ్రి పై వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు రికార్డు చేస్తుంది. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు సీజ్ చేసిన నగదును పోలీసులకు సమర్పిస్తారు. ఎఫ్.ఐ.ఆర్ నమోదు కాని నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌కు సమర్పిస్తారు. గ్రీవెన్స్‌సెల్ తగిన ఆధారాలను పరిశీలించి నేరారోపణ లేకపోతే ఆ నగదును సంబంధిత వ్యక్తులకు అందజేస్తారు. ప్రభుత్వ వాహనాలను కూడా చెక్ చేసే అధికారం ఈ బృందాలకు ఉంది. ఎలాంటి సమస్యలు ఎదురైనా కలెక్టరేట్‌లో 24గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ అందుబాటులో కూడా ఉంటుంది. మొత్తానికి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్ద ఎత్తున వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ, బీఆర్ఎస్ పొత్తు

- సింగరేణిలో స్కాములే తప్ప స్కీములు లేవు
- మున్సిపాలిటీ ఎన్నికల్లో కలిసి పని చేద్దాం



**క్యాతన్ పల్లి, మహా :** మున్సిపాలిటీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ, (సిపిఐ), భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పొత్తుతో ముందుకు సాగుతాయని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీ.ఆర్.ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ వెల్లడించారు. శనివారం క్యాతన్ పల్లి భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో లౌకిక భావజాలం కలిగిన వ్యక్తులతో కలిసి పని చేయనున్నట్లు చెప్పారు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో స్కాములు తప్ప స్కాములు తప్ప స్కీములు లేవని ఎద్దేవా చేశారు. ఇక్కడున్న 22 కౌన్సిలర్ సీట్లలో ఒకటి రెండు తక్కువ ఎక్కువైన గెలుపే లక్ష్యంగా పని చేయాలని కిందిస్థాయి నేతలకు పిలుపునిచ్చారు. కేసిఆర్ పాలనలో క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో 3365 మంది నివాస గృహాలకు పట్టాలిచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో ఇక్కడ ఒక్కరికి కూడా పట్టా ఇవ్వలేదని విమర్శించారు. తాను పట్టణంలో పలు అభివృద్ధి పనులకు నిధులను విడుదల చేపించి ప్రారంభించిన పనులను సైతం చెన్నూరు ఎమ్మెల్యే నిలుపుదల చేశాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, పట్టణ అధ్యక్షులు కుంభగోని సుదర్శన్, రామిడి కుమార్, మాజీ సర్పంచ్ జాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సంక్షేమం అభివృద్ధే ధ్యేయం

### సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను వేడుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజక వర్గం కన్నెపల్లి మండలంలోని చర్లపల్లి గ్రామపంచాయితీలో వనదేవతలు సమ్మక్క-సారక్క తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించిప్రజల సంక్షేమం అభివృద్ధే ధ్యేయం అని మొక్కులనుచెల్లించి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వేడుకున్నారు.శుక్రవారం రోజుఆయన జాతరకు విచ్చేయగా మాజీ ఎంపీపీ మాదారపు సృజన నర్సింగరావు ప్రత్యేకంగా ఆహ్వానించారు.అనంతరం జరుగుతున్న జాతర ప్రాముఖ్యతను ఎమ్మెల్యేకు వివరించారు. సమ్మక్క-సారక్క తల్లుల దీవెనలతో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు.స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదారపు సృజన నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామాంజనేయులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మూలాల కోసం ఖండాలు దాటి..
# డెన్మార్క్ దంపతుల ప్రయత్నం

### ఆదిలాబాద్ లో మీడియా సమావేశం




**ఆదిలాబాద్ మహా :** దత్తత తీసుకొని పెంచుకున్న కొడుకు మూలాలు వెతుక్కుంటూ ఓ జంట ఖండాంతరాలు దాటి డెన్మార్క్ నుండి ఆదిలాబాద్ పట్టణానికి వచ్చింది. 2016 లో రిమ్స్ ఆసుపత్రిలో ఓమహిళ ఓ రెండు నెలల మగ శిశువును వదిలేసి వెళ్లింది. శిశువు అందంగా ఉన్నా రెండు చేతి వేళ్లు సరిగా లేవు. బహుశా వదిలి వెళ్లడానికి ఇదే కారణమన్న సందేహాలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు బాలుడిని శిశు గృహకు తరలించి పోషించారు.2018లో డెన్మార్క్ కు చెందిన లూయిస్ రాస్మస్ దంపతులు చట్టబద్దంగా బాలుడు (అర్జున్ )ని దత్తత తీసుకొని వెళ్లి పోయారు. ప్రస్తుతం అర్జున్ వయసు 10 సంవత్సరాలు.తాను ఎవరు తనను కన్నవారు ఎవరు అన్న ప్రశ్న తలెత్తడంతో మళ్లీ ఇన్నాళ్ల తర్వాత తన దత్తపుత్రుడి తల్లిదండుల ఆచూకీ కనుకున్నేందుకు డెన్మార్క్ దంపతులు శనివారం ఆదిలాబాద్ కు చేరుకున్నారు. అడాప్టీ రైట్స్ కౌన్సిల్ సహకారంతో బాలుడి కన్నతల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. అర్జున్ మూలాల గురించి సమాచారం తెలిసిన వారు తమను సంప్రదించాలని ఆ దంపతులు మీడియా ద్వారా కోరుతున్నారు. 2016 సమయంలో ఇలా రెండు చేతులకు వంకర వేళ్లతో జన్మించిన శిశువు వివరాలు రికార్డుల్లో నమోదైతే తెలపాలని ఈ సందర్భంగా వారు ఆసుపత్రి వర్గాలను, అంగన్ వాడీ సిబ్బందిని కోరుతున్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రజలకు కూడా బాలుడి మూలాలు తెలిస్తే చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



### 10 సంవత్సరాల బాలికపై
## వీధి కుక్క దాడి...

### గాయపడిన బాలిక ఆసుపత్రికి తరలింపు..

**రాజేంద్రనగర్, మహా ;** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హుడా కాలనీలో ఆడుకుంటున్న పది సంవత్సరాల బాలికపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.కుక్కల దాడిలో బాలిక కింది పడి అరవడంతో స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని ఆ కుక్క నుంచి బాలికను రక్షించారు. అనంతరం గాయపడిన బాలికను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కుక్కలను పట్టుకునేందుకు వచ్చిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వెళ్లిపోతున్నారని మండిపడ్డారు.మరోసారి ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆదిలాబాద్ లో రికార్డు స్థాయిలో నామినేషన్లు

- వార్డులు 49,అభ్యర్థులు 506, నామినేషన్లు 769
- కాంగ్రెస్268, బీఆర్ఎస్ 136, బీజేపీ 124, స్వతంత్రులు 118
- బుజ్జగింపులు షురూ..పార్టీలకు రెబల్స్ బెడద
- ఉపసంహరణ అనంతరం తేలనున్న లెక్క




**ఆదిలాబాద్, మహా:** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆదిలాబాద్ మున్సి పాలిటీ పరిధిలోని 49 వార్డులకు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో వార్డునుండి పదుల సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో ఎవరికి భీం ఫాం ఇవ్వాలో అర్థం కాక పార్టీలు తర్జన భర్జన పడుతున్నాయి. 49వార్డులకు ఇండిపెండెట్లు అన్ని పార్టీలు కలిపి మొత్తం 506 మంది 769 నామినేషన్లు వేసారు. దీంతో బుజ్జగింపుల పర్వం మొదలైంది ఇప్పటికే బీఫాం విషయంలో ఆయా పార్టీల హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని నాయకులు చెబుతున్నా తమకు బీఫాం వస్తుందో రాదో అన్న టెన్షన్ ఆయా అభ్యర్థులో నెలకొంది. బీఫాం అందిన తర్వాత పార్టీ నుండి ఆ అభ్యర్థి తప్ప మిగతా వారు పోటీలో లేకుండా ఆయా పార్టీలు ఇప్పటినుండే జాగ్రత్త పడుతున్నాయి. రెబల్స్ పై క్రమశిక్షణచర్యలుంటాయన్న సంకేతాలిస్తున్నాయి. మూడు ప్రధాన పార్టీలలో ఇదే సమస్య నెలకొంది.అయితే వాటిలో కాంగ్రెస్ పార్టీ నుండి మొత్తం 268 నామినేషన్లు, బీఆర్ ఎస్ నుండి 136 , బీజేపీ నుండి 124,ఇండిపెండెంట్లు 118,గుర్తింపు పొందిన ఇతర అన్నిపార్టీల నుండి 72, ఎంఐఎం 38, బీఎస్పీ 8, సీపీయం నుండి 5 మొత్తం 769 నామినేషన్లు పడ్డాయి. ఇండిపెండెట్లను రెబల్స్‌ను బుజ్జగించి ఉపసంహరణకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఇందులో కొందరు నయనో భయానో నానినా మరి కొందరు మాత్రం ససేమిరా అంటున్నట్టు సమాచారం.ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచేవారి లెక్క తేలనుంది. ఉపసంహరణ సమయం వరకు ఎంతమంది విత్‌డ్రా చేసుకుంటారో ఎందరు పోటీలో ఉంటాలో వేచి చూడాలి.

# పేలిన గోల్డ్ బబుల్..

## లీ మాటలు నిజమవుతున్నాయా?





బంగారం, వెండి ధరలు తగ్గుతాయి.. తొందరపడి కొనుగోలు చేయకండి అని గ్లోబల్ ఎకనామిక్ అడ్వైజర్స్ చీఫ్ ఎకనామిస్ట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ 'విలియం లీ' హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. ఆయన మాటలు నిజయమయ్యాయా అనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధరలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. దీంతో రేట్లు భారీగా తగ్గిపోయాయి. ధరల తగ్గుదల అటు పెట్టుబడిదారుల్లో.. వ్యాపారుల్లో కూడా ఆందోళన కలిగిస్తోంది. పసిడి ధరల పెరుగుదలను లీ.. నీటి బుడగ (బబుల్)తో పోల్చారు. ఈ బుడగ ఎప్పుడైనా పగిలిపోయే అవకాశం ఉందన్నారు. ఆ గోల్డ్ బబుల్ ఇప్పుడు పేలిపోయింది. జనవరి 30న బంగారం ధర దాదాపు 9 శాతం తగ్గిపోయి రూ. 1.67 లక్షలకు (10 గ్రాములు) చేరింది. వెండి కూడా రెండు రోజుల్లో కేజీ ధర రూ. 75వేలు తగ్గింది. దీంతో సిల్వర్ రేటు 3.50 లక్షలకు చేరింది. ఈ ధర ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వైట్ ఓక్ క్యాపిటల్ ప్రకారం.. బంగారం & వెండి ధరలను భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక వ్యవస్థలోని వ్యవస్థాగత ప్రమాదాలు & కరెన్సీపై ఒత్తిడి వంటివి ప్రభావం చూపుతాయి. నిజానికి వెండి.. బంగారం నిష్పత్తి 80:1గా ఉండేది. కొన్నాళ్లుగా పెరిగిన ధరలు ఈ నిష్పత్తిని 46:1కి చేర్చింది. దీన్నిబట్టి వెండి ఏ స్థాయిలో పెరిగిందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.బంగారం, వెండి ధరలు భారీగా తగ్గడం ఇదే మొదటిసారి కాదు. 2011 ఏప్రిల్‌లో కేజీ వెండి ధర రూ.73,288 వద్దకు చేరి, ఆ తరువాత 55 శాతం పడిపోయింది. తిరిగి ఆ స్థాయి నుంచి కోలుకోవడానికి తొమ్మిది సంవత్సరాలు పట్టింది. అదే విధంగా.. 2012 సెప్టెంబర్‌లో బంగారం 10 గ్రాములకు రూ.32,147 వద్ద గరిష్టాన్ని తాకి, 25 శాతం పడిపోయింది. మళ్ళీ మునుపటి స్థాయికి చేరుకోవడానికి ఏడు సంవత్సరాలు పట్టింది. ఇప్పుడు మళ్లీ అదే రిపీట్ అవుతుందా? అని చాలామంది అనుకుంటున్నారు.

# న్యూయార్క్ బడ్జెట్.. టూ డిఫరెంట్!



న్యూయార్క్ సిటీ బడ్జెట్ సీజన్ ప్రారంభమైన సందర్భంగా, నగర మేయర్ జోహ్రాన్ క్వామే మమ్దానీ ప్రజలకు బడ్జెట్ ప్రాముఖ్యతను వివరించారు. నగర బడ్జెట్ అనేది కేవలం సంఖ్యల పట్టిక మాత్రమే కాదని, అది ప్రజల దైనందిన జీవితాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని ఆయన తెలిపారు. "బడ్జెట్ అనేది ఒక స్ప్రెడ్‌షీట్ కాదు. లైబ్రరీలు తెరిచి ఉంటాయా లేదా, కుటుంబాలు చైల్డ్‌కేర్‌ను భరించగలుగుతాయా అనే విషయాలను ఇది నిర్ణయిస్తుంది," అని మమ్దానీ అన్నారు. "ఇది మన విలువల ప్రతిబింబం, మనం నిర్మించాలనుకుంటున్న నగరానికి ఒక ప్రకటన." న్యూయార్క్ సిటీలో రెండు రకాల బడ్జెట్లు ఉన్నాయి. 'క్యాపిటల్ బడ్జెట్' ద్వారా పార్కులు, పాఠశాలలు వంటి దీర్ఘకాలిక అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తారు. 'ఎక్స్‌పెన్స్ బడ్జెట్' ద్వారా అద్దె సహాయం, శానిటేషన్ సిబ్బంది నియామకం, ఇతర ముఖ్యమైన నగర సేవలకు ఖర్చు చేస్తారు. ఈ వివరణలో మమ్దానీ ప్రధానంగా ఎక్స్‌పెన్స్ బడ్జెట్‌పై దృష్టి పెట్టారు. ఇతర నగరాలతో పోలిస్తే, న్యూయార్క్ సిటీ బడ్జెట్ ప్రక్రియ ప్రత్యేకమైనది. ఇక్కడ ఒక్క బడ్జెట్ మాత్రమే కాకుండా నాలుగు దశల్లో బడ్జెట్‌ను విడుదల చేస్తారు. మొదటగా ప్రిలిమినరీ బడ్జెట్ విడుదల అవుతుంది. ఇందులో నగరానికి అందుబాటులో ఉన్న ఆదాయం, రాబోయే సంవత్సరాల్లో చేయాల్సిన ఖర్చుల అంచనాలు ఉంటాయి. ఈ బడ్జెట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, తదుపరి సంవత్సరం, ఇంకా మూడు భవిష్యత్ సంవత్సరాల అంచనాలను కూడా కలిగి ఉండాలి. ఇది 1970ల ఆర్థిక సంక్షోభం తర్వాత తీసుకొచ్చిన సంస్కరణల ఫలితం. ప్రిలిమినరీ బడ్జెట్ తర్వాత సిటీ కౌన్సిల్ విచారణలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించి తమ ప్రాధాన్యాలను ప్రతిపాదిస్తుంది. మే నెలలో 'ఎగ్జిక్యూటివ్ బడ్జెట్' విడుదలవుతుంది. ఇందులో సవరించిన ఖర్చుల ప్రణాళిక ఉంటుంది. అనంతరం మరోసారి కౌన్సిల్ విచారణలు జరిగి, చర్చలు ప్రారంభమవుతాయి. జూన్ చివరికి సిటీ కౌన్సిల్ బడ్జెట్‌పై ఓటింగ్ నిర్వహిస్తుంది. మేయర్, కౌన్సిల్ మధ్య అధికారిక అంగీకారం తర్వాత బడ్జెట్ ఖరారవుతుంది. రాష్ట్ర బడ్జెట్ కూడా నగర బడ్జెట్‌పై ప్రభావం చూపుతుందని మమ్దానీ గుర్తు చేశారు. ఆల్బనీ (రాష్ట్ర ప్రభుత్వం) తీసుకునే నిర్ణయాలు నగరం ఏం చేయగలదో నిర్ణయిస్తాయి. ఫెడరల్ ప్రభుత్వంలా కాకుండా, న్యూయార్క్ సిటీ లోటు బడ్జెట్ నడపడానికి చట్టపరంగా అనుమతి లేదు. అందువల్ల అన్ని ఖర్చులు అందుబాటులో ఉన్న ఆదాయంతోనే కప్పబడాలి.బడ్జెట్ ప్రక్రియలో పెద్ద లోటులు రాకుండా చూసుకోవడమే తమ లక్ష్యమని, సాధ్యం కాని హామీలు ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నామని మేయర్ తెలిపారు. "ఈ బడ్జెట్ మీ భవిష్యత్.. ఇది ఎలా పనిచేస్తుందో తెలుసుకునే హక్కు మీకు ఉంది" " అంటూ న్యూయార్క్ నగరవాసులను ఉద్దేశించి మమ్దానీ పేర్కొన్నారు.

# ఎన్‌బీఎఫ్‌సీ బంగారం రుణాలు పెరుగుదల



బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల నిర్వహణలోని బంగారం రుణ ఆస్తులు (గోల్డ్ లోన్ ఏయూఎం) 207 మార్చి నాటికి రూ.4 లక్షల కోట్లకు చేరుకుంటాయని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం మధ్య 40 శాతం వృద్ధి చెందనున్నట్టు పేర్కొంది. 2023 నుంచి 2025 మధ్య వార్షిక రుణ వృద్ధి 27 శాతం కంటే అధికమని తెలిపింది. బంగారం ధరలు గణనీయంగా పెరగడం వాటిపై రుణ వితరణను వృద్ధి చేయనున్నట్టు పేర్కొంది. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో బంగారం ధరలు 68 శాతం పెరిగి ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. దీంతో బంగారం తనఖా విలువ పెరిగింది. రుణదాతలు మరింత మొత్తంలో రుణ పంపిణీకి అవకాశం ఏర్పడింది. అన్‌సెక్యూర్డ్ తదితర విభాగాల్లో రుణ లభ్యతకు పరిమిత అవకాశాల నేపథ్యంలో రుణ గ్రహీతలు.. ఇతర మార్గాల్లో రుణాలపై దృష్టి సారించారు. ఈ పరిస్థితుల్లో బంగారం రుణ సేవల్లోని ఎన్‌బీఎఫ్‌సీలు బ్యాంకుల నుంచి గట్టి పోటీ నెలకొన్నప్పటికీ తమ మార్కెట్ వాటాను విస్తరించుకుంటున్నాయి"అని క్రిసిల్ రేటింగ్స్ తన నివేదికలో వివరించింది.


# ఆదివారం స్పెషల్ ట్రేడింగ్..!


కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆదివారం (ఫిబ్రవరి 1న) స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ జరగనుంది. సాధారణ పనిదినాల మాదిరిగానే ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు మార్కెట్ పనిచేస్తుంది. ఎంసీఎక్స్‌లో ఉదయం 9నుంచి 5 గంటల వరకు మొదటి సెషన్‌లో ట్రేడింగ్ జరుగుతుంది. సాధారణంగా స్టాక్ మార్కెట్లకు శనివారం, ఆదివారం సెలవు రోజులు. అయితే యూనియన్ బడ్జెట్ 2026ను ఆదివారం (ఫిబ్రవరి 1) ప్రవేశపెడుతున్నారు. ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టడం అరుదైన ఘటన.. కాబట్టి ఆ రోజు స్టాక్ మార్కెట్ యధావిధిగా తెరిచే ఉంటుంది (స్టాక్ మార్కెట్‌కు ఆదివారం సెలవు లేదన్నమాట).




# జియో-బీపీ యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్

ఇంధన రిటైలింగ్, మొబిలిటీ సంస్థ జియోబీపీ తాజాగా ఇండియా ఎనర్జీ వీక్ సందర్భంగా వినూత్నమైన 'యాక్టివ్' టెక్నాలజీ పెట్రోల్‌ని ఆవిష్కరించింది. కీలకమైన ఇంజిన్ విడిభాగాలను శుభ్రంగా ఉంచుతూ, పనితీరును మెరుగుపరుస్తూ, మెయింటెనెన్స్ వ్యయాలను తగ్గిస్తూ, అదనంగా ఖర్చులేమీ లేకుండా వాహనం ఏటా మరో 100 కి.మీ. ఎక్కువ దూరం ప్రయాణించేందుకు ఉపయోగపడేలా ఈ ఇంధనం ఉంటుందని సంస్థ తెలిపింది. మోటర్‌సైకిల్‌లో నింపి, కోయంబత్తూరులోని టెస్ట్ ట్రాక్‌లో 4,000కు పైగా కి.మీ. మేర దీని సామర్థ్యాలను ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు సంస్థ చైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు. దేశీయంగా వాహనదారులు సాఫీగా నడిచే, విశ్వసనీయమైన, తక్కువ మెయింటెనెన్స్ ఉంటూ ఇంధనంపై అదనంగా వెచ్చించకుండా ఎక్కువ మైలేజీ ఉండాలని కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే జియో-బీపీ యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్‌ని రూపొందించినట్లు వివరించారు. దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్ దిగ్గజం బీపీ కలిసి జియో-బీపీని జాయింట్ వెంచరుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.





## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# ఇజ్రాయెల్ భీకర దాడులు

**గాజాలో ఆరుగురు చిన్నారులు సహా 31 మంది మృతి .. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చాక అత్యధిక మరణాలు**

**దెయిర్ అల్-బలాహ్:** గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ ఆర్మీ భారీ వైమానికదాడులకు దిగింది. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వేర్వేరు ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా కనీసం 31 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గతేడాది అక్టోబర్ 10వ తేదీ నుంచి అమలవుతున్న కాల్పుల విరమణ ఒప్పందం సమయంలో ఇజ్రాయెల్ దాడుల్లో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలకు పాల్పడుతోందంటూ శుక్రవారం ఆరోపణలు చేసిన ఇజ్రాయెల్.. కొద్ది గంటల్లోనే గాజా సిటీలోని అపార్టుమెంట్ భవనం, పోలీస్‌స్టేషన్‌లతోపాటు ఖాన్‌యూనిస్‌లోని శరణార్థుల టెంట్‌పై ప్రధానంగా దాడులు జరిపింది. పోలీస్‌స్టేషన్‌పై జరిగిన దాడిలో 14 మంది చనిపోగా, పలువురు గాయపడ్డారని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. టెంట్‌పై జరిగిన దాడిలో మంటలు చెలరేగి ఒక తండ్రి, అతడి ముగ్గురు పిల్లలు, మరో ముగ్గురు మనవలు మృతి చెందారు. గాజా సిటీలోని అపార్టుమెంట్ భవనంపై జరిగిన మరో దాడిలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు చనిపోయారు. గాజా సిటీలోని పోలీస్‌స్టేషన్‌పై జరిగిన దాడిలో నలుగురు మహిళా పోలీసులు సహా 14 మంది మృతి చెందారని ఆస్పత్రి వర్గాలు వివరించాయి. జబాలియా శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో ఒకరు చనిపోయినట్లు నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ చర్యలను హమాస్ తీవ్రంగా ఖండించింది. దాడులను ఆపేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తేవాలని అమెరికాను, ఇతర దేశాలను కోరింది. అయితే, ఒప్పందంలోని షరతులను హమాస్ ఉల్లంఘిస్తున్నందునే దాడులకు దిగాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. తమ దాడుల్లో రఫాలోని ఓ టన్నెల్ నుంచి బయటకు వస్తున్న ముగ్గురు సాయుధులు మరణించారని ప్రకటించింది. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చాక ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో శుక్రవారం వరకు కనీసం 520 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. ఇలా ఉండగా, గాజా వాసులకు జీవనాధారమైన ఈజిప్టు సరిహద్దుల్లోని రఫా క్రాసింగ్‌ను పాదచారుల కోసం ఆదివారం తెరుస్తామంటూ ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటన చేయడం తెల్సిందే. దీంతో, కాల్పుల విరమణ ఒప్పందం అమలు రెండో దశ ప్రారంభమైందని భావిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ మళ్లీ దాడులకు తెగబడటం ఆందోళన కలిగించే పరిణామమని పరిశీలకులు అంటున్నారు.



# ఇరాన్‌లో బాంబు పేలుళ్లు..



## 5 గురు మృతి

ఇరాన్‌లో బాంబుల మోత మోగింది. ఆ దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో బాంబుల మోత మోగింది. ఈ దాడుల్లో ఐదుగురు మరణించినట్లు సమాచారం. కాగా ఈ పేలుళ్లను ఇరాన్ ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. శనివారం ఇరాన్‌లోని ఏడు నగరాల్లో బాంబు పేలుళ్లు సంభవించాయి. ఆ దేశ రాజధాని టెహ్రాన్‌తో పాటు, పరాండ్, తబ్రిజ్, కోమ్, అహ్వాజ్, నానాజ్ తో పాటు బందర్, అబ్బాస్ నగరాల్లో పెద్దఎత్తున పేలుళ్లతో దద్ధరిల్లింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించగా, 14 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. అయితే ఈ పేలుళ్లకు తమ బాధ్యత లేదని అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ప్రకటించాయి.అయితే ప్రస్తుతం ఇరాన్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఆ దేశంలో ఖమేనీ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజలు పెద్దఎత్తున రోడ్లెక్కారు. ఈ ఆందోళనలో దాదాపు ఐదు వేల మందికి పైగా మృతిచెందినట్లు ఆ దేశ అధికారులు ప్రకటించారు. అయితే ఈ ఘటనపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ స్పందించారు. ప్రస్తుతం ఇరాన్‌లో నడుస్తున్న నిరసనలను అమెరికా, ఇజ్రాయెల్ ఆసరాగా తీసుకోవాలని చూస్తున్నాయని తెలిపారు. తద్వారా ఇరాన్‌లో అశాంతి వ్యాప్తి చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా దేశాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్నాయని ఇరాన్ అధ్యక్షుడు తెలిపారు.

# పాక్‌లో విమానాశ్రయాల వేలం.. కారణం అదే?




పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశంలోని ప్రధాన నగరాలలోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా వేలం వేయనున్నట్లు తెలిపింది. ఆసక్తి ఉన్న బహుళజాతి కంపెనీలు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చని ప్రకటించింది. ఇటీవల యుఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్‌లో ఆకస్మిక పర్యటన చేశారు. అనంతరం కొద్దిరోజులకే ఆయన పాకిస్థాన్‌లోని కరాచీ ఎయిర్‌పోర్టు నిర్వహించే బాధ్యతనుంచి యూఏఈ తప్పుకుంటుందని ప్రకటించారు. ఈ విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆ దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్వహణకు బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్, కరాచీ, లాహెర్ విమానాశ్రయాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు ఆ దేశ అధికారులు తెలిపారు. గతంలో ఇస్లామాబాద్ విమానాశ్రయం నిర్వహణను ప్రభుత్వమే నిర్వహించాలని భావించినా ప్రస్తుతం ఆ ఆలోచన నుంచి విరమించుకున్నట్లు తెలిపారు. దీనికోసం దేశీయ సంస్థలతో పాటు ఆసక్తి ఉన్న అంతర్జాతీయ సంస్థలు సైతం బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చని అధికారులు పేర్కొన్నారు. విమానాశ్రయాల కార్యకలాపాల సామర్థ్యాలను పెంచడంతో పాటు మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం పెట్టుబడులను ప్రోత్సహించడం తదితర కారణాల రీత్యా వీటికి బిడ్డింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ బిడ్డింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని ఇందులో ఎటువంటి రాజకీయాలకు తావులేదని పేర్కొన్నారు.కాగా ఈ విషయంలో యుఏఈ టర్కీ, సౌదీ అరేబియా వంటి దేశాలకు చెందిన సంస్థలతో సానుకూల చర్చలు జరిగాయని అయితే ఇస్లామాబాద్ విమానాశ్రయాన్ని యుఏఈకి లీజ్ ఇచ్చినట్లు వచ్చిన వార్తలు అసత్యమని పాక్ తెలిపింది. అటువంటి ఒప్పందాలు ఏవి జరగలేదని పేర్కొంది.

# యుఎస్‌లో షట్‌డౌన్.. నిలిచిన ప్రభుత్వ సేవలు



అమెరికాలో ప్రభుత్వం షట్‌డౌన్ అయ్యింది. దీంతో అక్కడి ప్రభుత్వ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. 2026 బడ్జెట్‌కు సంబంధించిన గడువు అర్ధరాత్రితో ముగిసింది. దానికి మద్దతు లభించకపోవడంతో తాత్కాలికంగా ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. ఇటీవల అమెరికాలో ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు పౌరులపై కాల్పులు జరపడంతో ఆదేశంలో ప్రభుత్వం పట్ల తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. ట్రంప్ ప్రభుత్వంపై యుఎస్‌లో వ్యతిరేకత తీవ్ర స్థాయిలో పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఆ దేశంలోని పౌరులు అక్కడి పాలనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసన చేపట్టారు. ఇటీవల ఆ దేశంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు తీరుపై అక్కడి డెమెక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బిల్లులకు మద్దతివ్వమని తెలిపారు. ఈ నేపథ్యంలో తాజాగా అక్కడి ప్రభుత్వం షట్‌డౌన్ అయ్యింది. మాదక ద్రవ్యాల స్మగ్లర్లు, పిల్లలను నిర్బంధించే వారు, మానవ అక్రమ రవాణాదారులను అరెస్టు చేయాడానికి బదులుగా యుఎస్ ప్రభుత్వం శాంతియుత నిరసన కారులపై దాడులు చేస్తోందని తెలిపారు. శాంతియుత నిరసనకారులను లక్షంగా చేసుకొని యూఎస్ దాడులకు తెగబడుతుందని సెనెట్ డెమెక్రాటిక్ మైనారిటీ విప్ దర్బిన్ పేర్కొన్నారు. అంతేకాకుండా చట్టాన్ని అమలు చేసే అధికారులకు సరిహద్దు భద్రతా దళాలకు యుఎస్ ప్రజలు మద్దతు ఇస్తారు కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే అధికారులకు వారు ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వబోరని తెలిపారు. అయితే ఇదివరకే ట్రంప్ విధానాలను సంస్కరించాలని లేకపోతే నిధుల విడుదలకు అవసరమైన బిల్లులకు ఎట్టి పరిస్థితుల్లో మద్దతివ్వమని వారు హెచ్చరించారు. అయితే ఇది తాత్కాలికమేనని వచ్చే వారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే గతంలోనూ అమెరికాలో ఒకసారి షట్‌డౌన్ అయ్యింది.



# శ్రీలీలకు గోల్డెన్ ఛాన్స్..

## బిగ్ ప్రాజెక్ట్ కు ఎంపిక

నటుడు ధనుష్ వరుస హిట్లతో దూసుకుపోతున్నాడు. కుబేర, ఇడ్లీకడై, హిందీ చిత్రం తేరేఇష్క్‌మే వంటి ప్రాజెక్ట్‌లతో పాన్ ఇండియా రేంజ్‌లో తన సత్తా చాటుతున్నాడు. తాజాగా తన 55వ సినిమా వివరాలను ఆయన పంచుకున్నాడు. అమరన్ వంటి సంచలన విజయాన్ని సాదించిన చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామితో ధనుష్ సినిమా ప్రకటన ఇప్పటికే వచ్చిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఈ ప్రాజెక్ట్‌లోకి హీరోయిన్‌గా శ్రీలీల ఎంట్రీ ఇచ్చేసింది. ఈమేరకు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. భారీ ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఇందులో ధనుష్‌తో పాటు మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ముఖ్యపాత్రను పోషించనున్నట్లు సమాచారం. ఇకపోతే ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు సాయిఅభయంకర్ పనిచేస్తున్నారు ఈ విషయాన్ని చిత్రవర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఐసరిగణేశ్ తమ వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని సమ్మర్ ముగింపు సమయంలో తెరపైకి రావడానికి రెడీ అవుతోంది. హీరోయిన్ శ్రీలీల వరుస సినిమాలతో దూసుకెళుతుంది. ప్రస్తుతం ఆమె తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో మెప్పిస్తుంది. ఇప్పటికే 'పరాశక్తి' చిత్రంతో తమిళ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ఇప్పుడు ధనుష్‌తో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగమైంది.



# ఇప్పుడు రూ.900 కోట్ల ఆస్తి..

## తొలి జీతం ఎంతంటే?

బాలీవుడ్‌లో రిచెస్ట్ హీరోయిన్, అందాలరాశి ఎవరంటే ముందు ఐశ్వర్యరాయ్ పేరే వినిపిస్తుంది. ఒకప్పుడు సినిమా రంగాన్ని ఏలిన ఐష్ ఆస్తి విలువ దాదాపు రూ.900 కోట్లు ఉంటుందని అంచనా.. అయితే ఇంత పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించడం అంత ఈజీ కాదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈ స్థాయికి చేరుకున్న ఐశ్వర్య తొలి సంపాదన ఎంతో చూసేద్దాం..

**తొలి సంపాదన ఎంతంటే?**

బాలీవుడ్ నిర్మాత శైలేంద్ర సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఐశ్వర్య కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒడిదుడుకులను గురించి వెల్లడించాడు. ఆయన మాట్లాడుతూ.. నేను ఐశ్వర్యరాయ్‌ను తొలిసారి చూసినప్పుడు ఆమెకు 18 లేదా 19 ఏళ్లు ఉంటాయనుకుంటా.. ఐదువేల రూపాయలకే మూడు యాడ్స్‌లో నటించింది.

**అలా మొదలైంది**

ఒకదాంట్లో అయితే బ్యాక్‌గ్రౌండ్‌లో ఎక్కడో ఉందంతే! కానీ ఐశ్వర్య లుక్స్ అందరినీ ఆకర్షించేవి. దాంతో వాణిజ్య ప్రకటనలో నటించమని ఆఫర్లు రావడం మొదలయ్యాయి. అలా అక్కడి నుంచి సినిమాల్లోకి వచ్చింది అని చెప్పుకొచ్చాడు. ఈయన ఫిరాఖ్, ఫిర్ మిలేంగే, పేజ్ 3 వంటి పలు సినిమాలు నిర్మించాడు.

**జర్నీ**

1994లో మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత సినిమాల్లో ఎంట్రీ ఇచ్చింది. జీన్స్ అనే తమిళ చిత్రంతో అందరి కంట్లో పడింది. దేవదాస్, జోధా అక్బర్, ఏ దిల్ హై ముష్కిల్, హమ్ దిల్‌దే చుకే సనం వంటి పలు చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా మారింది. కళ్లతోనే ఎక్స్‌ప్రెషన్స్ పలికిస్తూ డ్యాన్స్‌తో అద్భుతః అనిపిస్తూ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. చివరగా పొన్నియన్ సెల్వన్ 2 సినిమాలో యాక్ట్ చేసింది. 2009లో కేంద్రం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది.



# ఏడు తరాలు గుర్తుండిపోతుంది: నవీన్ పొలిశెట్టి

''నిర్మాత నాగవంశీ సినిమాని ఎంతో ప్రేమిస్తాడు. సినిమాని ఎంత ప్రేమిస్తే, అంత మంచి విజయం వస్తుందని మాలాంటి వారు కూడా వంశీని చూసి నేర్చుకోవాలి. మూవీ కోసం నవీన్ పొలిశెట్టి ప్రాణం పెడతాడు. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని చెప్పడానికి ఉదాహరణ 'అనగ నగా ఒక రాజు'' అని నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజు చెప్పారు. నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి జోడీగా నటించిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా జనవరి 14న విడుదలై, రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన విజయోత్సవానికి 'దిల్' రాజు, దర్శకుడు బాబీ కొల్లి అతిథులుగా హాజరయ్యారు.బాబీ మాట్లాడుతూ- ''ఇటీవల నేను చిరంజీవిగారిని కలిసినప్పుడు... 'అనగనగా ఒక రాజు' బాగుందట కదా... ఈ తరంలో నాకు బాగా నచ్చిన హీరో నవీన్'' అన్నారు. ''ఈ సంక్రాంతి మా యూనిట్‌కి ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోతుంది'' అని నవీన్ పొలిశెట్టి చెప్పారు. ''మా డిస్ట్రిబ్యూటర్లు మంచి లాభాలు చూశామనడం సంతోషాన్నిచ్చింది'' అన్నారు సూర్యదేవర నాగవంశీ. ''ప్రేక్షకులు ఎంజాయ్ చేయడం చూసి మా కష్టమంతా మర్చిపోయాను'' అని మారి తెలిపారు. మీనాక్షీ చౌదరి, రచయిత్రి, క్రియేటివ్ డైరెక్టర్ చిన్మయి, రచయిత చంద్రబోస్ మాట్లాడారు.


# సింగీతం శ్రీనివాసరావు కొత్త సినిమా ప్రకటన



లెజెండరీ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు 94ఏళ్ల వయసులో మళ్లీ మెగా ఫోన్ పెట్టారు. దశాబ్దాల తెలుగు సినిమా చరిత్రలో ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తెరకెక్కించారు. తన దర్శకత్వ ప్రతిభతో ప్రేక్షకలోకాన్ని పుష్పక విమానంపై ఊయలలూగించారు. జానపదాన్ని ప్రేమించడమేకాదు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అద్భుత ప్రయోగాలతో అపురూప కళాఖండాలను ఆవిష్కరించిన తెరమాంత్రికుడాయన. కేవలం దర్శకుడిగానే కాదు, సంగీతంలోను ఔరా అనుపించుకున్నారు. ఆదిత్య 369, భైరవ ద్వీపం, పుష్పక విమానం, మయూరి, బృందావనం వంటి అద్భుతమైన చిత్రాలను ఆయన తెరకెక్కించారు. ప్రయోగాత్మక చిత్రాలు తీయాలంటే సింగీతం శ్రీనివాసరావు తర్వాతనే ఎవరైనా అనేలా చెరగని ముద్ర వేశారు. చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత ఆయన ఒక కొత్త సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ నిర్మిస్తుండగా రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండటం విశేషం. ఈ మూవీని ప్రకటిస్తూ చిత్ర యూనిట్ ఒక వీడియోను పంచుకుంది. అయితే, సినిమా పేరుతో పాటు నటీనటుల విషయాలను త్వరలో ప్రకటించనున్నారు.

# రామ్‌చరణ్, ఉపాసనకు కవలలు..

## ఆనందంలో చిరంజీవి



**హైదరాబాద్:** సినీ నటుడు రామ్‌చరణ్ మరోసారి తండ్రి అయ్యారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో ఆయన భార్య ఉపాసన కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఒక పాప, బాబుకు ఉపాసన జన్మనిచ్చారని చిరంజీవి శనివారం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని, గ్రాండ్ పేరెంట్స్‌గా ఈ శిశువులను తమ ఫ్యామిలీలోకి సంతోషంగా ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. రామ్‌చరణ్, ఉపాసనలకు 2023, జూన్ 20న తొలి సంతానంగా క్లీంకార కొణిదెల జన్మించిన విషయం తెలిసిందే.



# అమ్మనయ్యాక పూర్తిగా మారిపోయా..

అమ్మ అన్న పిలుపుతో ఆడదాని లోకమే మారిపోతుందంటారు. హీరోయిన్ ఆలియా భట్ కూడా అందుకు అతీతురాలు కాదు. తల్లయ్యాక తన ప్రపంచమే మారిపోయిందంటోంది ఆలియా. మాతృత్వం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గర్భిణీగా ఉన్న తొమ్మిది నెలల్లో చాలా మార్పులొస్తాయి. శరీరమే కాదు మన ఆలోచన విధానాలు కూడా మారుతుంటాయి.

**డిలీట్ చేయాలన్న ఆలోచన**

ఎప్పుడైతే కడుపులో ప్రాణం పోసుకున్న బిడ్డను కళ్లారా చూస్తామో అప్పుడు పూర్తిగా మనల్ని మనమే మర్చిపోతాం. తనే ప్రపంచంగా మనకే తెలియనంతగా మారిపోతాం. మళ్లీ ఒకప్పటిలా ఉండాలనుకున్నా అది అసాధ్యం. చాలాసార్లు సోషల్ మీడియా డిలీట్ చేయాలనిపించేది. కానీ నా కెరీర్ ప్రారంభం నుంచి నన్ను సపోర్ట్ చేసినవారితో బంధాన్ని తెంచుకోవడం ఇష్టం లేక ఆ ఆలోచన విరమించుకున్నాను. కొన్నిసార్లు నా వ్యక్తిగత విషయాల్ని అందరితో పంచుకోవాలనిపించడం లేదు.

**నేను కూడా ట్రై చేయాలి**

అది నా పర్సనల్ అని నా అభిప్రాయం. నా ఫోన్‌లో మొత్తం రాహా ఫోటోలే ఉన్నాయి. నేను కూడా అప్పుడప్పుడు ఫోటోలు దిగడానికి ప్రయత్నించాలి అని చెప్పుకొచ్చింది. ఆలియా భట్- రణ్‌బీర్ కపూర్ 2022లో పెళ్లి చేసుకున్నారు. అదే ఏడాది వీరికి కూతురు రాహా జన్మించింది. ప్రస్తుతం ఆలియా, రణ్‌బీర్.. లవ్ అండ్ వార్ సినిమా చేస్తున్నారు. నిర్మాతగా డోంట్ బీ షై సినిమా చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com